

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 2 సంచిక : 277 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శుక్రవారం 3 జనవరి 2025 | వెల : 4/-




## కాంగ్రెస్ ప్రభుత్వంలో వేల కోట్ల కుంభకోణాలు

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి షాకింగ్ కామెంట్స్
- మంత్రులు ఎవరెవరు ఇన్వాల్ అయ్యారో ఆధారాలతో సహా చెబుతా
- కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధుపై తన విధి విధానాలు ఏందో చెప్పింది
- రాష్ట్ర రైతాంగం మీద కాంగ్రెస్ ప్రభుత్వ విధి విధానాలు ఏంటో చెప్పాలని
- రైతు సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫల అయింది
- గడిచిన ఏడాది అంత కాంగ్రెస్ మోసాల సంవత్సరం

హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వంలో కొన్ని వేల కోట్ల కుంభకోణాలు జరిగాయని.. వాటిని త్వరలో బయట పెడతామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఇందులో మంత్రులు ఎవరెవరు ఇన్వాల్ అయ్యారో ఆధారాలతో సహా చెబుతామని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూస్తామని అన్నారు. రేవంత్ రెడ్డీ సినిమా డైలాగ్‌లకు మాత్రమే పరిమితమయ్యారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిందని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధుపై తన విధి విధానాలు ఏందో చెప్పిందని అన్నారు. రాష్ట్ర రైతాంగం మీద కాంగ్రెస్ ప్రభుత్వ విధి విధానాలు ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. రైతు సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫల అయిందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. రైతు బంధును రైతు భరోసాగా పేరు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏం లేదని ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి - మిగతా3లో



## మహా కుంభమేళాలో భక్తులే లక్ష్యంగా బెదిరింపులు

- అప్రమత్తమైన యూపీ పోలీసులు
- కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- ఈ కుంభమేళాకు బాంబు బెదిరింపులు రావడం ప్రస్తుతం కలకలం రేపుతోంది
- మతపరమైన ఈ కార్యక్రమానికి హాజరయ్యే కనీసం 1,000 మందిని లక్ష్యంగా చేసుకొని బెదిరింపులు

# రైతు భరోసా... సెల్ఫ్ డిక్లరేషన్?

- రైతు భరోసా కోసం కొత్తగా దరఖాస్తులు..!
- జనవరి 14 నుంచి అమలు..!!
- రైతు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలన్న షరతు విధించే అవకాశాలు
- తొలి విడత నిధులను 7,500 రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్లాన్
- అయితే సాగు చేస్తున్న రైతులందరికీ రైతు భరోసా ను తొలుత విడుదల చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం




హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయబోయే రైతు భరోసా పథకంపై కేబినెట్ సబ్ కమిటీ చర్చించింది. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు అధికారులు హాజరై, రైతు భరోసా విధివిధానాలపై చర్చించారు. ఎల్లుండి జరిగే కేబినెట్ సమావేశంలో రైతు భరోసా అమలుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

పంట సాగు చేసే ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, భూమి పరిమితి పెట్టొద్దని కమిటీ అభిప్రాయ పడినట్లు సమాచారం. రైతు భరోసా అమలు కోసం కొత్తగా రైతుల నుంచి - మిగతా3లో



## అవినీతి, అరాచక కాంగ్రెస్‌ను గద్దె దింపేదాక పోరాటం సాగిద్దాం

- బీఆర్ఎస్ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి
- క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు కనబరిచిన కదనోత్సాహం.. రాష్ట్ర స్థాయిలో పని చేసే నాయకత్వంలో కూడా మాటలకందని స్థాయిలో కొండంత స్ఫూర్తి నింపింది
- గులాబీ సైనికులు రాష్ట్ర ప్రజలపక్షాన.. విరామం ఎరుగని పోరాటం చేస్తున్నారు
- అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన ఈ తుగ్లక్ పాలన వల్ల కష్టకాలంలో ఉన్న అన్ని వర్గాల పక్షాన అలుపులేని పోరాటం చేశారు

## ఈ నెల 8న విశాఖకు రానున్న మోదీ



- నేరుగా ఏయూ ఇంజనీరింగ్ కాలేజీకి..
- అక్కడి నుంచే పలు ప్రాజెక్టులకు వర్చువల్ గా శంకుస్థాపన
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్



## బెంగాల్‌లో చొరబాట్లకు కేంద్రం పాత్ర..

- బంగ్లాదేశీయులను బీఎస్ఎఫ్ అనుమతిస్తోంది
- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ
- కేంద్ర ప్రభుత్వానిది 'నీచమైన బ్లూప్రింట్'
- బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు బెంగాల్‌లో శాంతికి విఘాతం కలిగిస్తోంది
- మహిళలను చిత్రహింసలకు గురిచేస్తోంది.




## బీసీలపై బీఆర్ఎస్ కపట ప్రేమ

- అధికారం పోయిన తరువాత బీఆర్ఎస్‌కు బీసీలు గుర్తుకొచ్చారు
- బీసీలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ మాత్రమే చేయగలదు
- కాంగ్రెస్ బీసీలకు పెద్దపీట వేస్తుందనడానికి నిదర్శనం నన్ను తెలంగాణ అధ్యక్షులుగా నియమించడమే.
- టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్

పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ బీసీలను వంచించడమే కాకుండా, వారికి న్యాయంగా అందాల్సిన నిధులను ఏ ఒక్క సంవత్సరంలో కూడా ఖర్చు చేయకుండా వారిని నిట్టనిలువునా ముంచిందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గురువారం అయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితపై మండిపడ్డారు. మహేష్ కుమార్ మాట్లాడుతూ ఇప్పుడు అధికారం పోయిన తర్వాత బీసీలపై కపట ప్రేమ చూపుతూ కల్వకుంట్ల - మిగతా3లో

# రేషన్ కార్డులు ఎప్పుడు?

- ఏడాది నుంచి ఇదిగో... అదిగో అంటూ కాలయాపన!
- ఇప్పటికే కొత్త కార్డుల జారీ పలుమార్లు వాయిదా పడటంతో ఆశావహులకు ఎదురు చూపులు
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులు ప్రకారం జిల్లాలోని సివిల్ సప్లై శాఖ కొత్త రేషన్ కార్డులు జారీకి సన్నాహాలు చేస్తున్నారు
- రాష్ట్ర ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనల ప్రకారం గా అర్హుల ఎంపిక




హైదరాబాద్

రేషన్ కార్డుల జారీపై తెలంగాణలో ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే కొత్త కార్డుల జారీ పలుమార్లు వాయిదా పడటంతో ఆశావహులకు ఎదురు చూపులు తప్పడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో రేషన్ కార్డుల జారీపై ప్రకటనలు జారీ చేస్తూ వాయిదా వేస్తూ కేవలం రెండుసార్లు మాత్రమే స్వల్ప సంఖ్యలో రేషన్ కార్డులు అందించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 2016 నుంచి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం 2019లో కొన్ని కార్డులు అందించి ఆ వెబ్‌సైట్ మూసివేసింది. ఇదే తీరున కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని సంక్రాంతి పండుగ సైతం రేషన్ కార్డులు అందజేయకుంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో - మిగతా3లో

# 2024 సార్వత్రిక ఎన్నికల్లో అద్భుతం

## చరిత్రలో ఎన్నడూ లేనన్ని ఓట్లు రెండు జాతీయ పార్టీల సొంతం!

చరిత్రలో ఎన్నడూ లేనన్ని అత్యధిక ఓట్లను 2024 సార్వత్రిక ఎన్నికల్లోనే సొంతం చేసుకున్నాయి అధికార పార్టీ బీజేపీ, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్. అయినా కూడా ఆ రెండు పార్టీలకు చెప్పుకోదగ్గ స్థాయిలో సీట్లు దక్కలేదని తాజా నివేదికలు వెల్లడించాయి. బీజేపీ ఇదివరకు ఎన్నడూలేని విధంగా 23.59 కోట్ల ఓట్లు సాధించిందని, అయితే సొంతంగా అధికారం చేపట్టగలిగే మెజారిటీ మార్కు 272ను మాత్రం ఈ సారి చేరుకోలేకపోయిందని అందులో పేర్కొంది. కాంగ్రెస్ 13.67 కోట్ల ఓట్లను దక్కించుకున్నప్పటికీ, ఆ పార్టీ ప్రతిపక్ష హెూదాకే పరిమితమైంది. 1984లో ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన ఎన్నికల ద్వారా కాంగ్రెస్ మరో తరంలోకి అడుగుపెట్టగా, ఇక అదే ఎన్నికల్లో కాలు మోపి బీజేపీ కొత్త తరం రాజకీయాలకు నాంది పలికింది. కానీ ఈ నాలుగు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ పార్టీ 11.54 కోట్ల ఓట్ల నుంచి 13.67 కోట్ల ఓట్లకు చేరగా, (18.42% వృద్ధి), బీజేపీ 1.82 కోట్ల నుంచి 23.59 కోట్లకు (1,196% వృద్ధి) ఎగబాకిందని నివేదికలు వెల్లడించాయి.

అయితే బీజేపీ 1996 (స్వల్పకాలం), 1998, 1999, 2014, 2019, 2024లలో, కాంగ్రెస్ 1984, 1991, 2004, 2009లలో అధికారాన్ని చేపట్టాయి. 1989, 1996లలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ పేరుతో బీజేపీ, కాంగ్రెసేతర పక్షాలు స్వల్పకాలం వరకూ మాత్రమే అధికారాన్ని చెలాయించగలిగాయి. తాజాగా ఈ వివరాలను





ఎన్నికల సంఘం విడుదల చేయడం గమనార్హం.

**ఆరు జాతీయ పార్టీలకు 63% ఓట్లు**

మరోవైపు 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చెల్లిన ఓట్లలో 63శాతం ఓట్లను 6 జాతీయ పార్టీలు దక్కించుకున్నాయని తెలుస్తోంది. అయితే ఈ ఎన్నికల్లో వీటితో పాటు 47 గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీలు, అలాగే 690 రిజిస్టరైన, రిజిస్టరు కాని పార్టీలు కూడా పోటీ చేశాయి. ఇక ఈ ఎన్నికల్లో 3,921 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేయగా, అందులో కేవలం ఏడుగురు మాత్రమే విజయం సాధించారు. వారి ఓట్ల శాతం 2.79గా ఉంది.

## ట్రాఫిక్‌జామ్‌లో ఆసియాలోనే బెంగళూరు టాప్..

# ఏడాదికి 132 గంటలు రోడ్డుపైనే!

మన దేశంలో ట్రాఫిక్ జామ్ అంటే ముందుగా గుర్తొచ్చేది కర్ణాటక రాజధాని బెంగళూరు మహానగరమే. స్వల్ప దూరానికే గంటలు గంటలు వేచి చూడటం నగర పౌరులకు నిత్యం అనుభవమే. వాహనాల ట్రాఫిక్‌తో ప్రయాణం నరకప్రాయంగా ఉండే నగరాల జాబితాలో బెంగళూరుది దేశంలోనే అగ్రస్థానం. ఇప్పుడు ట్రాఫిక్ జామ్ పరంగా ఆసియాలోనే టాప్ 10 నగరాల జాబితాలో బెంగళూరు మొదటిస్థానంలో నిలిచింది. టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ 2023 ప్రకారం.. ఆసియాలోనే అత్యంత రద్దీగా ఉండే టాప్ 10 నగరాల జాబితాలో బెంగళూరు తొలి స్థానంలో నిలిచింది. ఇక్కడ పీక్ అవర్స్‌లో కేవలం 10 కిలోమీటర్ల దూరానికే ఏకంగా 28 నిమిషాల 10 సెకన్ల సమయం పడుతుంది. అంటే ఈ టెక్‌హబ్‌లోని నివాసితులు ఏటా దాదాపు 132 గంటలపాటు ట్రాఫిక్ జామ్‌లోనే చిక్కుకుపోతారు. అందుకు కారణంగా బెంగళూరులో రద్దీకి తోడు నగరం వేగంగా విస్తరిస్తుండటమే. దక్షిణ, ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా బెంగళూరుకే వెళ్తుంటారు. ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ అక్కడే నివసిస్తుంటారు. దీంతో పట్టణం కూడా బాగా విస్తరిస్తోంది. మరోవైపు ఈ సిలికాన్ సిటీలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పాలకులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం రావడం లేదు. నగర రోడ్లలో ప్రయాణం నరకయాతంగా మారిపోయింది. ఇక పీక్స్ అవర్స్, హాలిడేస్‌లో ట్రాఫిక్‌ను తప్పించుకోవడం పెద్ద టాస్క్‌గా మారింది. ఇక ఈ జాబితాలో బెంగళూరు తర్వాత పూణె రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ 10 కిలోమీటర్ల దూరానికి 27 నిమిషాల 50 సెకన్ల సమయం పడుతోంది. ఆ



తర్వాత ఫిలిప్పీన్స్‌లోని మనీలా (27 నిమిషాల 20 సెకన్లు) , తైవాన్‌లోని తైచుంగ్ (26 నిమిషాల 50 సెకన్లు), జపాన్‌లోని సప్పోరో (26 నిమిషాల 50 సెకన్లు), తైవాన్‌లోని %ఖుశీష్ట్రంఅబఅస్త్ర జఓ్ఎ% (26 నిమిషాలు), జపాన్‌లోని నగోయా (24 నిమిషాల 20 సెకన్లు), ఇండొనేషియాలోని జకార్తా (23 నిమిషాల 20 సెకన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. టామ్‌టామ్ ట్రాఫిక్ సూచిక 6 ఖండాల్లోని 55 దేశాల్లో ఉన్న 387 నగరాల మీద రీసెర్చ్ చేసి నివేదిక విడుదల చేసింది. నగరాల్లో సగటు ప్రయాణ సమయం, ఇంధన ఖర్చులతోపాటు మరికొన్ని అంశాలను ఆధారంగా చేసుకొని నివేదికను సిద్ధం చేసింది. ఇక ప్రపంచ వ్యాప్తంగా చూస్తే యూకేలోని లండన్ అత్యంత నెమ్మదిగా వాహనాలు కదిలే నగరంగా నిలిచింది. ఇక్కడ సగటున 10 కిలోమీటర్ల దూరానికి 37 నిమిషాల 20 సెకన్ల సమయం పడుతుంది.

## అమెరికాలోని కుమార్తెకు ఫుడ్ పార్శిల్ పంపిన మహిళ

### బ్యాంక్ అకౌంట్లో రూ.కోటిన్నర మాయం!

రోజురోజుకూ సైబరాసురులు రెచ్చిపోతున్నారు. అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఎక్కువ మొత్తంలో డబ్బులు చోరీ చేస్తున్నారు. సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలంటూ అధికారులు



హెచ్చరిస్తున్నా కొందరు మాత్రం వారి వలలో చిక్కుకుపోతున్నారు. తాజాగా ఓ మహిళ ఇలాంటి సైబర్? మోసగాళ్ల వలలో చిక్కుకుని రూ. కోటికి పైగా కోల్పోయింది. మహారాష్ట్రలోని ముంబయికి చెందిన ఓ 78ఏళ్ల మహిళ అమెరికాలో ఉంటున్న తన కుమార్తె కోసం కొన్ని ఆహార పదార్థాలతో పాటు మరి కొన్ని వస్తువులు పంపాలని నిర్ణయించు కుంది. అనంతరం ఓ కొరియర్ సర్వీసును సంప్రదించింది. ఆ కొరియర్ పంపిన తరువాతి రోజు అదే కంపెనీ నుంచి మాట్లాడుతున్నామంటూ ఓ వ్యక్తి వృద్ధురాలికి ఫోన్ చేశాడు. 'మీరు పంపించిన కొరియర్‌లో ఆహారంతో పాటు ఆధార్ కార్డు, గడువు ముగిసిన పాస్‌పోర్ట్‌లు, క్రెడిట్ కార్డులు, 2000 డాలర్ల నగదు, ఇతర వస్తువులు ఉన్నాయి' అని చెప్పాడు. మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశాడు. ఆ వృద్ధురాలిని నమ్మించేందుకు మరో ఇద్దరితో కలిసి ఉన్నతాధికారుల్లా నటించారు. సైబర్ మోసగాళ్లు వృద్ధురాలికి చేసిన వీడియో కాల్స్‌లో అధికారాల యూనిఫాంలో కనిపించి మరింత భయపెట్టారు. విచారణ పేరుతో పది రోజుల పాటు వృద్ధ మహిళతో మాట్లాడారు. ఈ క్రమంలోనే ఆమె బ్యాంకు ఖాతా వివరాలు సేకరించారు. అనంతరం వారి ఖాతాల్లోకి మహిళ ఖాతాలో ఉన్న రూ.కోటిన్నరను బదిలీ చేయించుకున్నారు. అయితే ఆ మహిళ జరిగిన విషయాన్నంతా తన కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి సైబర్? మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ విభాగం ప్రజలకు సూచించింది. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు వస్తే తమకు ఫిర్యాదు చేయాలని కోరింది.

## స్విస్‌లో కూడా బురఖా బ్యాన్

**న్యూఢిల్లీ :** స్విట్జర్లాండ్‌లో బహిరంగ ప్రదేశాల్లో బురఖా ధరించడంపై నిషేధం అమల్లోకి వచ్చింది. ప్రజలు తిరిగే ప్రైవేట్ భవనాల్లో కూడా బురఖా నిషేధించబడుతుంది. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారికి 1,000 స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 96,947) జరిమానా విధించబడుతుంది. ఈ నిర్ణయాన్ని ముస్లిం సంస్థలు, హక్కుల కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2021లో జరిగిన దేశవ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణలో, 51 శాతం మంది బురఖా



నిషేధానికి అనుకూలంగా ఓటు వేశారు. ఈ నిర్ణయాన్ని అక్కడి పార్లమెంట్ కూడా ఆమోదించింది. దాదాపు 8.85 మిలియన్ల జనాభా కలిగిన స్విట్జర్లాండ్‌లో, ముస్లింలు 5 శాతం ఉన్నారు. ఈ కొత్త చట్టం ప్రకారం, బహిరంగ ప్రదేశాల్లో ముఖాన్ని కప్పి ఉంచడం నిషేధించబడింది, ఈ నిబంధనను ఉల్లంఘిస్తే వెయ్యి స్విస్ ఫ్రాంక్‌ల (దాదాపు రూ. 96 వేలు) జరిమానా విధించబడుతుంది. స్విట్జర్లాండ్‌లో 2021 ప్రజాభిప్రాయ సేకరణలో ఆమోదించబడిన ఈ నిషేధాన్ని ముస్లిం సంస్థలు విమర్శించాయి. విశేషమేమిటంటే, 2009లో దేశంలో కొత్త మినార్ల నిర్మాణాన్ని నిషేధించిన గ్రూపునే బురఖాపై నిషేధం విధించింది.2021లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో స్విట్జర్లాండ్‌లో 51.21 శాతం మంది ప్రజలు ఈ నిషేధానికి మద్దతుగా ఓటు వేశారు. మితవాద స్విస్ పీపుల్స్ పార్టీ దేశంలో బురఖా నిషేధాన్ని ప్రతిపాదించింది, ఇది దేశ సాంస్కృతిక విలువలు, ప్రజా భద్రతను కాపాడుతుందని వాదించింది. దీని తరువాత, 2022 సంవత్సరంలో దేశ జాతీయ కౌన్సిల్ ఈ చట్టాన్ని ఆమోదించింది. దీని ప్రకారం, బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, దుకాణాలు, రెస్టారెంట్లలో మహిళలు తమ ముఖాలను పూర్తిగా కప్పి ఉంచడం నిషేధించబడింది.బురఖా నిషేధానికి సంబంధించి స్విస్ ప్రభుత్వం విమానాల్లో లేదా దౌత్య, కాన్సులర్ ప్రాంగణాల్లో బురఖా నిషేధం వర్తించదని స్పష్టం చేసింది. ఇది కాకుండా, మతపరమైన ప్రదేశాలు, ఇతర పవిత్ర ప్రదేశాలలో ఒక వ్యక్తి తన ముఖాన్ని కప్పుకోవడానికి కూడా అనుమతించబడతారు. ఆరోగ్యం, భద్రతా కారణాలు, సాంప్రదాయ ఆచారాలు లేదా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఫేస్ కవర్లు అనుమతించబడతాయని ప్రభుత్వం తెలిపింది. కళాత్మక లేదా వినోద కారణాలతో పాటు ప్రకటనల ప్రయోజనాల కోసం వారికి ఈ ఆమోదం మంజూరు చేసింది.సెప్టెంబరు 2022లో కొంతమంది ముస్లిం మహిళలు ధరించే బురఖా వంటి ముఖ కవచాలను నిషేధించాలని స్విట్జర్లాండ్ పార్లమెంటు దిగువ సభ ఓటు వేసింది. జాతీయ కౌన్సిల్ ఈ చట్టానికి వ్యతిరేకంగా 29 ఓట్లతో పోలిస్తే 151 ఓట్లతో ఆమోదించింది. అనేక ముస్లిం సంస్థల అభ్యంతరాలు ఉన్నప్పటికీ రైట్-వింగ్ స్విస్ పీపుల్స్ పార్టీ ఈ చట్టం కోసం ముందుకు వచ్చింది. ఇలా చేయడంలో స్విట్జర్లాండ్ మొదటి దేశం కాదు, ఐరోపాలోని బెల్జియం, డెన్మార్క్, ఫ్రాన్స్ వంటి దేశాలు కూడా ఇలాంటి ఆంక్షలు విధించాయి. అయితే, ఈ యూరోపియన్ దేశాలలో మత స్వేచ్ఛకు సంబంధించి చాలాసార్లు ప్రశ్నలు తలెత్తాయి. ప్రజా భద్రత పేరుతో చేసిన ఈ చట్టాల ద్వారా ముస్లిం మహిళలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు.

## బెంగాల్‌లో చొరబాట్లకు కేంద్రం పాత్ర

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ రాష్ట్రంలోకి చొరబాట్లకు కేంద్ర ప్రభుత్వం ముఖ్య పాత్ర పోషిస్తున్నదని విమర్శించారు. అందుకే బంగ్లాదేశీయుల చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతిస్తున్నదని ఆరోపించారు. కేంద్ర



ప్రభుత్వానిది 'నీచమైన బ్లూప్రింట్' అని మండిపడ్డారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు బెంగాల్‌లో శాంతికి విఘాతం కలిగిస్తోందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఇటీవల ఆరోపించారు. అలాగే ఓటు బ్యాంకు కోసం బంగ్లాదేశీయులకు సంబంధిత పత్రాలను టీఎంసీ అందజేస్తున్నదని, వారి చొరబాట్లకు సహకరిస్తున్నదని బీజేపీ విమర్శించింది. కాగా, గురువారం అధికారులతో సమావేశం సందర్భంగా సీఎం మమతా బెనర్జీ ఈ ఆరోపణలపై స్పందించారు. రాష్ట్రాన్ని అస్థిరపరిచేందుకు బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను కేంద్ర బలగాలు అనుమతిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రం 'నీచమైన బ్లూప్రింట్' అమలు చేస్తున్నదని విమర్శించారు. 'వివిధ ప్రాంతాల నుంచి బెంగాల్‌లోకి చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతిస్తోంది. మహిళలను చిత్రహింసలకు గురిచేస్తోంది. సరిహద్దులను టీఎంసీ కాపాడటం లేదు. సరిహద్దు మా చేతుల్లో లేదు. కాబట్టి చొరబాట్లను టీఎంసీ అనుమతించిందని ఎవరైనా ఆరోపిస్తే, అది బీఎస్ఎఫ్ బాధ్యత అని నేను ఎత్తి చూపుతా' అని అన్నారు. మరోవైపు సరిహద్దులో చొరబాట్ల గురించి రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్రం వద్ద కూడా సమాచారం ఉందని మమతా బెనర్జీ తెలిపారు. డీజీపీ రాజీవ్ కుమార్‌తోపాటు స్థానిక వర్గాల నుంచి తనకు సమాచారం అందిందని చెప్పారు. దీని గురించి కేంద్రానికి ఘాటుగా లేఖ రాస్తానని అన్నారు. అలాగే చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతించే ప్రాంతాలను గుర్తించి దర్యాప్తు చేయాలని డీజీపీని ఆదేశిస్తానని స్పష్టం చేశారు. కాగా, పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో శాంతి నెలకొనాలని ఆశిస్తున్నట్లు మమతా బెనర్జీ తెలిపారు. 'మాకు శత్రుత్వం లేదు. కానీ గూండాలను ఇక్కడకు అనుమతిస్తున్నారు. వారు నేరాలకు పాల్పడి సరిహద్దు దాటి తిరిగి వస్తున్నారు. ఈ చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతిస్తోంది. ఇందులో కేంద్రం పాత్ర కూడా ఉంది' అని అన్నారు. బెంగాల్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు ఆజ్యం పోసే ప్రయత్నం ఎవరైనా చేస్తే నిరసనలు తప్పవంటూ కేంద్రాన్ని హెచ్చరించారు.

## ఈ నెల 8న విశాఖకు రానున్న మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న ఆంధ్రప్రదేశ్ లో పర్యటించనున్నారు. ఈ టూర్ కు సంబంధించి ప్రధాని కార్యాలయం ఏపీ అధికారులకు సమాచారం అందించింది. ఈ నెల 8న ప్రధాని మోదీ విశాఖపట్నంలో ల్యాండ్ అవుతారని, అక్కడి నుంచి నేరుగా ఆంధ్రా యూనివర్సిటీ చేరుకుంటారని తెలుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రధానికి స్వాగతం పలుకుతారని అధికారులు తెలిపారు. ఎయిర్ పోర్ట్ నుంచి ప్రధానితో పాటు వారు కూడా ఏయూ చేరుకుంటారని వివరించారు. అక్కడి నుంచే ప్రధాని మోదీ ఏపీలోని పలు ప్రాజెక్టులకు వర్చువల్ గా శంకుస్థాపన చేస్తారని సమాచారం. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు, రైల్వేజోన్ పరిపాలన భవనాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ వర్చువల్ గా శంకుస్థాపన చేస్తారు. అనంతరం జరిగే బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ లతో కలిసి మోదీ పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కూడా పాల్గొంటారు. ఈమేరకు విశాఖ అధికారులకు పీఎంవో నుంచి సమాచారం అందిందని, అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారని సమాచారం.

## మహా కుంభమేళాలో భక్తులే లక్ష్యంగా బెదిరింపులు..



జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ ముస్తాబవుతోంది. మహా కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే, ఈ కుంభమేళాకు బాంబు బెదిరింపులు రావడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. ఓ ఎక్స్ యూజర్ ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. మతపరమైన ఈ కార్యక్రమానికి హాజరయ్యే కనీసం 1,000 మందిని లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన యూపీ పోలీసులు సదరు ఎక్స్ యూజర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు. కాగా, మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కుంభమేళాలో 45 కోట్లమంది భక్తులు పాల్గొని గంగాస్నానం ఆచరిచేం అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో పాల్గొనే భక్తుల సౌకర్యం కోసం 1,60,000 టెంట్లు, 1,50,000 మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 15,000 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తారు. 1,250 కిలోమీటర్ల పైప్‌లైనును సిద్ధం చేస్తున్నారు. 67 వేల ఎల్‌ఈడీ లైట్లు, 2 వేల సోలార్ లైట్లు, 3 లక్షల మొక్కలు ఏర్పాటవుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ రిస్ట్‌బ్యాండ్స్, యాప్ ట్రాకింగ్‌లతో భక్తులను లెక్కిస్తారు.

## శరద్ పవార్, తన కుమారుడు కలవాలని దేవుడ్ని ప్రార్థించా: అజిత్ పవార్ తల్లి

**ముంబై:** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ తల్లి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, తన కుమారుడు మళ్లీ కలవాలని దేవుడ్ని ప్రార్థించినట్లు తెలిపారు. తన ప్రార్థనలు ఫలిస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. కొత్త ఏడాది తొలి రోజైన బుధవారం అజిత్ పవార్ తల్లి ఆశా-తాయ్ పవార్,



పంఢర్‌పూర్‌లోని ప్రసిద్ధ విఠల్, రుక్మిణీ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తన కుమారుడు, విడిపోయిన శరద్ పవార్ మధ్య మళ్లీ సయోధ్య కుదరాలని విఠల్ స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. 'పవార్ కుటుంబంలో ఉన్న మనస్తాపాలన్నీ తొలగిపోవాలని నేను ప్రార్థించా. అజిత్, శరద్ పవార్ మళ్లీ కలవాలని నేను ప్రార్థించా. నా ప్రార్థనలు ఫలిస్తాయని ఆశిస్తున్నా' అని అన్నారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన తర్వాత అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ, ప్రత్యర్థి శరద్ పవార్ వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శరద్ పవార్‌తో తన కుమారుడు మళ్లీ కలవాలని అజిత్ పవార్ తల్లి ఆశా-తాయ్ పవార్ బహిరంగంగా ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకున్నది. ఎన్సీపీలో కీలక నేత ప్రఫుల్ పటేల్ కూడా దీనిపై స్పందించారు. 'శరద్ పవార్ మాకు దేవుడు లాంటివారు. పవార్ కుటుంబం ఏకమైతే నేను చాలా సంతోషిస్తా' అని మీడియాతో అన్నారు.

# తాగడంలో మనోళ్లు తోపులు

**డిసెంబర్ 30వ తేదీన ఒక్కరోజులోనే మద్యంపై వచ్చిన ఆదాయం అక్షరాలా 402.62 కోట్లు**



**హైదరాబాద్ :** మందు తాగడంలో మనోళ్లే తోపులు డిసెంబర్ 31 జనవరి 1లో రికార్డు సృష్టించారు ఎందుకంటే ఈసారి తెలుగు రాష్ట్రాల్లో మందుబాబులు తాగిన తాగుడుకు ఓ రకంగా చెప్పాలంటే మందు సీసాలతో పాటు మందు గ్లాసులు కూడా డ్యాన్స్ చేశాయి, ఎందుకంటే ఈ సారి తెలుగు రాష్ట్రాల్లో మందు బాబులు తాగిన తాగుడు చూస్తే రికార్డులు బద్దలు కొట్టడం ఖాయమనక తప్పదు. సిట్టింగ్ వేశారంటే సీసాలకు సీసాలు లేపే య్యాల్సిందే. దీంతో రాష్ట్ర ఖజానాకు భారీ ఆదాయం చేకూరింది. పండగ ఏదైనా సరే.. తాగడం మాత్రం ఉండాల్సిందే. ఈ సారి తెలుగు రాష్ట్రాల్లో మందు ఏరులై పారింది. క్రిస్మస్ ముందు రోజు నుంచి సంబురాలు షురూ అయ్యాయి. నేటికి ఆ సంబురాల్లో నుంచి జనాలు ఇంకా తేరుకోలేదు. ఎందు కంటే ఎక్సైజ్ శాఖ చరిత్ర లోనే రికార్డు స్థాయిలో మద్యం విక్రయించినట్లు చెబుతోంది.

కేవలం ఒక్క రోజులోనే 400కోట్ల మద్య తాగారంటే అర్థం చేసుకోవచ్చు. ఏరేంజ్ లో తాగారనేది. అయితే ఇతర బ్రాండ్స్ తో పోలిస్తే. ఈసారి బీర్లు పొంగిన తీరు చూసి అంతా షాక్ అవ్వాల్సిందే. ఇక ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో న్యూ ఇయర్ సెలబ్రేషన్ ఘనంగా జరుపుకున్నారు. మద్యం, మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. డిసెంబర్ 31వ తేదీ ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం , మాంసం దుకాణాల తోపాటు బేకరీలు, చికెన్, మటన్ షాపులు, హోటళ్లు గ్రామాల్లో బెల్టు షాపులు కూడా కిట కిట లాడాయి. డిసెంబర్ 31న 16.08కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయంటే మామూలు మాట కాదు. సాధారణంగా ఎక్సైజ్ శాఖకు డిసెంబర్ నెల ఆదాయం వచ్చే నెలగా భావిస్తుంటారు. దీనికోసం ప్రభుత్వంతో చర్చించి అన్ని బ్రాండ్ల మందును అందు బాటులోకి తీసుకువస్తుంటారు. వైన్ షాపు యజమానులు కూడా భారీగా మద్యం స్టాక్స్ కు దింపుతుంటారు.

ఈ సారి కూడా అది ఎక్కువగానే జరిగిందని చెప్పవచ్చు. డిసెంబర్ 28 నుంచి 5 రోజుల్లో 1800 కోట్లు రాబట్టాలని ఎక్సైజ్ శాఖ ఉన్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 30వ తేదీన ఒక్క రోజులోనే మద్యంపై వచ్చిన ఆదాయం అక్షరాలా 402.62 కోట్లు అని తెలుస్తోంది. అయితే ఇందులో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 3,82,265 లిక్కర్ కేసులు 3,96,114 బీర్ కేసులు అమ్ముడైనట్లు సమాచారం. ఇదంతా ఒక్క రోజులోనే జరిగింది. అది కూడా డిసెం బర్ 30వ తేదీన. అయితే ఈ లెక్కకు ఎక్కువగా ఉంటుందని అధికారుల నుంచి సమాచారం. ఇక అటు ఏపీలోనూ ఇదే తీరు కనిపిస్తుంది. క్రిస్మస్ నుంచి ప్రధాన జిల్లాల్లో మందు విక్రయాలు జోరుసాగాయి. మరోవైపు ప్రభుత్వం కూడా మందు ధరలు తగ్గించి విక్రయిం చడంతో మందుబాబులకు మరింత కిక్కెక్కింది. ఏపీ, తెలంగాణలోని పూర్తి మద్యం విక్రయాల సమాచారం వస్తే మనం షాక్ అవ్వాల్సిందే.

# అవినీతి, అరాచక కాంగ్రెస్‌ను గద్దె దింపేదాక పోరాటం సాగిద్దాం

**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ తుగ్లక్ విధానాలపైన, నిరంకుశ పాలనపైన, హామీలను ఎగవేసిన మోసపూరిత ప్రభుత్వ తీరుపైన మన పోరాటం కొనసాగిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. పోయిన ఏడాది పాటు కాంగ్రెస్ పార్టీ పరిపాలన వైఫల్యాలను ఎండగట్టిన పార్టీ శ్రేణులకు ఒక సందేశం ఇచ్చారు. ప్రాణ సమానులైన మన బీఆర్ఎస్ తోబుట్టువుల్లారా.. అంటూ ప్రారంభించిన కేటీఆర్, గత ఏడాది పాట చేసిన పోరాటాలను నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తూనే రానున్న రోజుల్లోనూ కాంగ్రెస్ మోసపూరిత ప్రభుత్వాన్ని గద్దెధించేదాకా పోరాటం సాగిద్దామని పిలుపునిచ్చారు. గత ఏడాది కాలంగా ఈ కాంగ్రెస్ నిరంకుశ పాలనపై గులాబీ సైనికులందరూ కనబరిచిన పోరాట స్ఫూర్తికి పేరుపేరునా ప్రతి ఒక్కరికి శిరస్సువంచి సలాం చేస్తున్నా. గెలుపు ఓటములతో నిమిత్తం లేకుండా.. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు కనబరిచిన కదనోత్సాహం.. రాష్ట్ర స్థాయిలో పని చేసే నాయకత్వంలో కూడా మాటలకందని స్థాయిలో కొండంత స్ఫూర్తి నింపిందని కేటీఆర్ పేర్కొన్నారు.

**గ్యారెంటీల గారడీని ప్రజాక్షేత్రంలో ఎండగట్టారు..**

తెలంగాణ గ్రామ గ్రామాన ఉన్న.. గులాబీ సైనికులు రాష్ట్ర ప్రజలపక్షాన.. విరామం ఎరుగని పోరాటం చేస్తున్నారనీ, అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన ఈ తుగ్లక్ పాలన వల్ల కష్టకాలంలో ఉన్న అన్ని వర్గాల పక్షాన అలుపులేని పోరాటం చేశారని అభినందించారు. ఏడాది కాలంలో పార్టీ శ్రేణులు రైతుల పక్షాన మీరు పోరాడారు, నేతన్నల గొంతుకై మీరు నిలిచారు, మహిళా సమస్యలపై మీరు గర్జించారు, బడుగు బలహీనవర్గాల ప్రజల



గళమయ్యారు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల పక్షాన సమరభేరి మోగించారు.. నిరుద్యోగుల హక్కుల కోసం కాంగ్రెస్ సర్కారును నిలదీశారు.. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీల గారడీని ప్రజాక్షేత్రంలో ఎండగట్టారని కేటీఆర్ తెలిపారు.

**బీఆర్ఎస్ శ్రేణులు మోగించిన జంగ్ సైరన్‌తో ముఖ్యమంత్రికి ముచ్చెమటలు**

'మూసీలో మూటల వేట' నుంచి 'లగచర్ల లడాయి' వరకూ.. అన్యాయం జరిగిన ప్రతిచోటా బాధితుల పక్షాన మీరు కొట్లాడారనీ, తెలంగాణ ప్రజల గుండెచప్పుడును అడుగుడుగునా మీరు ప్రతిధ్వనింపజేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు పార్టీ చేసిన పోరాటాలు.. చరిత్రపై చెరగని సంతకాలుగా నిలుస్తాయన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను, అత్యంత సమర్థంగా తిప్పికొట్టిన సందర్భాలు.. ఈ పోరాటపథంలో నిలిచి ఉండే మైలురాళ్లు మారాయి అని అన్నారు. తెలంగాణ ప్రజల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా.. అసమర్థ, అనాలోచిత కాంగ్రెస్ విధానాలపై.. బీఆర్ఎస్ శ్రేణులు మోగించిన జంగ్ సైరన్ ముఖ్యమంత్రికి ముచ్చెమటలు పట్టించిందని కేటీఆర్ పేర్కొన్నారు.

**మొక్కవోని ధైర్యంతో పార్టీ శ్రేణులు నిలబడ్డ తీరు అపూర్వం..**

భారత రాష్ట్ర సమితి చేసిన అలుపెరగని పోరాటాల వల్లే.. అదానీ ఆశజూపిన రూ.100 కోట్లను ప్రభుత్వం వెనక్కి ఇవ్వాల్సి వచ్చిందన్న కేటీఆర్, లగచర్ల లడాయి.. యావత్ దేశం ముందు నియంతృత్వ కాంగ్రెస్‌ను దోషిగా నిలబెట్టిందన్నారు. ఏడాదికాలంగా ప్రభుత్వాన్ని నిలదీసే క్రమంలో నియంతృత్వ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అక్రమ కేసులు పెట్టినా.. ప్రభుత్వం ఎంత వేధించాలని చూసినా.. మొక్కవోని ధైర్యంతో పార్టీ శ్రేణులు నిలబడ్డ తీరు అపూర్వం, అసాధారణం, చారిత్రాత్మకం అని కేటీఆర్ ప్రశంసించారు.

**గులాబీ సైనికులందరికీ గుండెల నిండా**

%దశాబ్దాలపాటు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను, కుక్కలు చింపిన విస్తరిలా మార్చే కాంగ్రెస్ కుట్రలను, అడుగడుగునా ప్రశ్నిద్దాం, నిలదీద్దామని పిలుపునిచ్చారు. మన పార్టీకి పునాది రాళ్లు, మన బీఆర్ఎస్‌కు మూలస్తంభాలు పార్టీ శ్రేణులు అని, మన గులాబీ జెండాకు.. వెన్నుముక మీరే అన్నారు. పార్టీ తరపున నిలబడి.. కలబడే.. నేటి అలుపెరగని పోరాట యోధులే.. రేపటి తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై బీఆర్ఎస్ పక్షాన మెరిసే.. వజ్రాయుధాలుగా మారుతారని ఆకాంక్షించారు. ఏడాది పాటు అద్భుతమైన పోరాట పటిమ చూపిన గులాబీ సైనికులందరికీ%ొా% గుండెల నిండా%ొా% మరోసారి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

# రేషన్ కార్డులు ఎప్పుడు?

-మొదటిపేజీ తరువాయి

తీవ్ర ప్రభావం చూపుతోందనే వాదనలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులు ప్రకారం జిల్లాలోని సివిల్ సప్లై శాఖ కొత్త రేషన్ కార్డులు జారీకి సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజుల నుండి అధికారులు అర్హుల జాబితాలను పరిశీలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనల ప్రకారం గా అర్హుల ఎంపికను చేపడుతోంది. కొత్త నిబంధనలు దేశంలోని పలు రాష్ట్రాల్లో గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కేరళ,, మహారాష్ట్ర, పంజాబ్ లలో ఏ విధంగా లబ్ధిదారులను ఎంపిక చేశారో అదే రీతిన మన తెలంగాణ ప్రభుత్వం సైతం నిబంధనల మార్పులు చేసినట్లు తెలుస్తుంది.ప్రజా సంక్షేమలో భాగంగా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుంది, ప్రభుత్వం నుంచి పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి కనీస అర్హత రేషన్ కార్డు ఆధార్ కార్డు కలిగి ఉండాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో కొత్త రేషన్ కార్డులు లేకపోవడంతో అర్హులైన వారికి కూడా అనర్హతకు గురవుతున్నారు.రేషన్ కార్డులో గల్లంతయిన పేర్లు, కొత్తగా జన్మించిన పేర్లు, పెళ్లి చేసుకున్న వారి పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. అయితే ఇటీవల ప్రజా పాలనలో భాగంగా సంక్షేమ పథకాలు లబ్ధి కోసం..రేషన్ కార్డుల దరఖాస్తుల కూడా స్వీకరించారు. ఇప్పటివరకు రేషన్ కార్డులు జారీ చేయలేదు.ఈ నేపథ్యంలో ఇటీవల శాసనసభల్లో సమావేశాలు సంక్రాంతి కానుకగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయనట్లు మంత్రి ఉత్తరం కుమార్ రెడ్డి



ప్రకటించారు. దీంతో పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి, కానీ కార్డుల జారిపై మారదర్శకాలు నిబంధనలపై స్పష్టత ఇవ్వలేదని పాత దరఖాస్తులు పరిగణలోకి తీసుకుంటారా? ప్రజాపాలనలో తీసుకున్న సమీకృత దరఖాస్తుల ఆధారంగా కార్డులు జారి చేస్తారా అనే సందేహం నెలకొంది.మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా అధికారులకు కసరత్తు చేస్తున్నారు, సర్పంచుల పదవీకాలం ముగిసి 11నెలలు కాకావస్తోంది, మరో నెల రోజులైతే పుర సంఘాల ఎన్నికలు రానున్నాయి. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు అధికారులు సన్నాహ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల జాబితాను కూడా విడుదల చేశారు. నోడల్ అధికారులు సైతం నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు ప్రకటిస్తే తెల్ల రేషన్ కార్డులు సన్న బియ్యం పంపిణీకి బ్రేకులు పద్ద ట్లేననే సందేహాలు ప్రజల్లో ఉన్నాయి.

## రైతు భరోసా... సెల్ఫ్ డిక్లరేషన్?

-మొదటిపేజీ తరువాయి

దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉంది. అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములు గుర్తించాలని నిర్ణయించారు. సంక్రాంతి పండుగ(జనవరి 14) నుంచి రైతు భరోసా అమలు చేసే అవకాశం ఉంది. ధరణి ప్రకారం కోటి 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు సమాచారం. సాగు చేయని భూములు తీసేస్తే కోటి 30 లక్షల ఎకరాలకు రైతు భరోసా అందే అవకాశం ఉంది.

**సంక్రాంతికి రైతు భరోసా**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను ఈ నెలలోనే అమలు చేయడానికి సిద్ధమయింది. సంక్రాంతికి రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేయడంతో అందుకు తగినట్లుగా విధివిధానాలను నిర్ణయించే పనిలో ఇటు అధికారులు, అటు మంత్రి వర్గ ఉప సంఘం ఉంది. అయితే ఇప్పటికే కొన్ని విధివిధానాలు ఖరారయ్యాయని చెబుతున్నారు. సంక్రాంతి నుంచి విడతల వారీగా నిధులను జమ చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతుంది. తొలి విడత నిధులను 7,500 రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్లాన్ చేస్తుంది. అయితే సాగు చేస్తున్న రైతులందరికీ రైతు భరోసా ను తొలుత విడుదల చేయాలన్న ఆలోచనలో ఉంది.. అదే సమయంలో కొన్ని ముఖ్యమైన నిర్ణయం కూడా తీసుకున్నట్లు తెలిసింది. రైతు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలన్న షరతు విధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తన భూమిలో ఏ పంటను సాగు చేస్తున్న విషయాన్ని రైతు డిక్లరేషన్ ద్వారా తెలియాచేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగానే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఎంత మేరకు రైతు సాగు చేశారో అంత వరకే రైతు భరోసా నిధులు ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయించిందని, మంత్రి వర్గ ఉప సంఘం కూడా ఈ రకమైన ప్రతిపాదనకు ఓకే చెప్పిందన్న వార్తలు వస్తున్నాయి. ఏదో ఒక పంట వేసి భూమిని సాగు చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులను తొలుత జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల జరిగే మంత్రివర్గ సమావేశంలో... అదే సమయంలో మిగిలిన వారి విషయం తర్వాత ఆలోచించవచ్చని తెలిపింది. సాగు కాని భూములకు రైతు భరోసా నిధులు ఇవ్వడం అనవసరమన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. సాగు కాని భూములకు రైతు భరోసా నిధులను జమ చేస్తే అది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని రేవంత్ రెడ్డి కూడా అభిప్రాయపడుతున్నారు. శాటిలైట్, ఇమేజ్ రిమోట్ సెన్సింగ్ సాయంతో సాగు విస్తీర్ణంపై ఒక క్లారిటీ వస్తుందని, దాని ప్రకారమే నిధులను విడుదల చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. జనవరి 2 వతేదీన మంత్రి వర్గ ఉప సంఘం సమావేశమై దీనిపై నిర్ణయం తీసుకుంటుంది. ఈ నెల 4వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో రైతు భరోసా విధివిధానాలపై నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిసింది.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో వేల కోట్ల కుంభకోణాలు

-మొదటిపేజీ తరువాయి



మాట్లాడుతూ.... గడిచిన ఏడాది అంత కాంగ్రెస్ మోసాల సంవత్సరమని విమర్శించారు. కొత్త ఏడాదిలో అయినా కాంగ్రెస్ ప్రభుత్వం మంచి బుద్ధి అలవరచుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం ఇచ్చిన మొదటి హామీ రైతు రుణమాఫీ అని చెప్పారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క లేనిపోని గొప్పలు చెబుతున్నారని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎద్దేవా చేశారు. రైతు కూలీలకు కేటాయించిన నిధులు ఎక్కడకు వెళ్లాయని ప్రశ్నించారు. 15లక్షల మంది ఉన్నట్లు రెవెన్యూ మంత్రి లెక్కలు చెప్పి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రూ. 9వేల కోట్లను డిసెంబర్ 28వ తేదీలోగా రైతుల ఖాతాల్లో వేస్తామని చెప్పి సబ్ కమిటీ ఏర్పాటు చేశారని అన్నారు. ఇందుకోసం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్ధిళ్ల శ్రీధర్ బాబు , పొంగులేటి శ్రీనివాసరెడ్డితో సబ్ కమిటీ ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కమిటీ నివేదికను ప్రభుత్వానికి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఎల్లుండి జరిగే కేబినెట్ భేటీలో రైతు భరోసాపై సరైన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. రబీ అయిపోయింది.. ఖరీఫ్‌లో రైతులకు ఎలాంటి ప్రోత్సాహం ఇస్తారో కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.

## బీసీలపై బీఆర్ఎస్ కపట ప్రేమ

-మొదటిపేజీ తరువాయి

కుటుంబం వారిపై మొసలికన్నీరు కారుస్తోంది. బీసీలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ మాత్రమే చేయగలదు. అధికారం పోయిన తర్వాత బీఆర్ఎస్ కు బీసీలు గుర్తుకొచ్చారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసి వారి గొంతు కోసింది బీఆర్ఎస్. లిక్కర్ స్కాంలో మరకంటించుకున్న ఎమ్మెల్సీ కవిత దాన్ని పోగొట్టుకోవడంతో పాటు బీఆర్ఎస్ పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడంతో ఎటూ పాలుపోని ఆమె రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడం కోసం ఇప్పుడు బీసీల పేరిట కపట నాటకం మొదలుపెట్టారు. అందులో భాగంగానే ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమం. విజ్ఞులైన బీసీలు ఈ కుట్రలను గమనించి బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుతున్నామని అన్నారుద. కాంగ్రెస్ బీసీలకు పెద్దపీట వేస్తుందనడానికి నిదర్శనం నన్ను తెలంగాణ అధ్యక్షులుగా నియమించడమే. అంతేకాక రాష్ట్ర క్యాబినెట్లో బీసీలకు అధిక ప్రాధాన్యతిచ్చిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదే.. మీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా బీసీ నేతను ఏర్పాటు చేయడం సాధ్యపడుతుందా..? గత మీ ప్రభుత్వ హయాంలో మంత్రులుగా బీసీలకు ఎంత ప్రాధాన్యతిచ్చారో బహిరంగ రహస్యమే. మీ పాలనలో బీసీలను అడుగడుగున అణగదొక్కిన మీరు ఇప్పుడు బీసీ జపం చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో, వారికి మరింత ప్రయోజనకరంగా ఉండేలా సలహాలు, సూచనలు ఇవ్వాల్సింది పోయి ధర్నా చేపట్టడం దురదృష్టకరం. బీసీల అభివృద్ధి కోసం పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన చర్యలు, ప్రస్తుతం ఏడాది కాంగ్రెస్ ప్రజా పాలనలో చేపట్టిన చర్యలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని నేను కవితను బీఆర్ ఎస్ నేతలను సవాలు చేస్తున్నానని అన్నారు.

## ఓరుగల్లు కమలానికి కష్టాలు...

వరంగల్ : ఓరుగల్లు జిల్లా నేతల తీరు తలనొప్పిగా మారిందట. అంతర్గత వర్గపోరుతో క్యాడర్‌ను చేజార్చుకుంటున్న నేతలు ఇప్పుడు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ అధిష్టానానికి లేఖలు సంధిస్తున్నారట. దీంతో ఏం చేయాలో అర్థం కాక తల పట్టుకుంటున్నారట కాషాయ పెద్దలు. దేశవ్యాప్తంగా బలాన్ని పెంచుకునేందుకు బిజెపి ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ బలోపేతం కోసం పావులు కదుపుతోంది పార్టీ తప్పిదాలు, అంతర్గత కుమ్ములాటల కారణంగా బలహీనపడుతున్నామని తెలుసుకున్న అదిష్టానం.. మొదటగా పార్టీలో నూతన కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. బూత్ స్థాయి కమిటీల నిర్మాణం పూర్తికాగా.. మండల, జిల్లా స్థాయి కమిటీలను జనవరి మొదటి వారంలో ప్రకటించనుంది. క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించే కమిటీల ఏర్పాటుకు సంబంధించి వర్గ పోరు తరాస్థాయికి చేరుతోంది. నేతల మధ్య వర్గపోరు కారణంగా తమ తమ అనుచరులకే కమిటీలలో అవకాశం కల్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో పార్టీ కోసం కష్టపడ్డ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది.ప్రస్తుత హనుమకొండ జిల్లా అధ్యక్షురాలుగా ఉన్న రావు పద్మకు వ్యతిరేకంగా హనుమకొండ జిల్లా నేతలంతా ఒక్కటయ్యారు. వరుసగా మూడుసార్లు అధ్యక్షురాలుగా పనిచేసిన రావు పద్మపై బిజెపిలోని మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలంతా గుర్రుగా ఉన్నారు. రావు పద్మ సీనియర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వట్లేదని ఆరోపణలు ఉన్నాయి. అందుకే రావు పద్మను కాదని మిగతా నేతలంతా ఒక్కటై పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జిల్లా అధ్యక్షురాలి పదవిలో ఉండి నేతలందరినీ కలుపుకోవాల్సిన ఆమె, వర్గాలను పెంచి పోషించారని బహిరంగంగానే బిజెపి శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

# సంపాదకీయం

## సన్నగిల్లుతున్న ప్రజాస్వామ్య విలువలు

అదుపులేని సంపదతో ఆధిపత్యం చెలాయిస్తున్న ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు కొదిమంది బిలియనీర్ల ముందు సాగిలపడటం, వారి గుప్పెట్లో 'ఆర్థిక నిరంకుశత్వం' కొనసాగడం ఆందోళన కలిగిస్తున్నది. కేవలం తమ అక్రమ సంపదకు రక్షణ కవచంగా మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థను తమ గుప్పెట్లో చీకించుకుంటున్న కొద్ది మంది బిలియనీర్ల వ్యవహారశైలి నిరంకుశ వ్యవస్థల అధినేతల కన్నా ప్రమాదకరంగా మారుతున్నది. ప్రజాస్వామ్యం, సామ్రాజ్యవాదం కూడలిలో ఒక వ్యక్తి స్థిరంగా న్యాయం, సమానత్వం కోసం తన స్వరం వినిపించగలగడం ఆశ్చర్యకరమే.అమెరికా సెనేట్‌లో తన మూడవ పదవీకాలం గడుపుతూ, అమెరికన్ కాంగ్రెస్ చరిత్రలో ఎక్కువ కాలం పనిచేసిన స్వతంత్ర సెనేటర్ బెర్నీ సాండర్స్ ఆర్థిక అసమానత, రాజకీయ అవినీతికి వ్యతిరేకంగా పోరాటానికి పర్యాయపదంగా నిలుస్తున్నారు. 'చాలా తక్కువ సంఖ్యలో ధనవంతులైన బిలియనీర్లు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ భాగాన్ని కలిగి ఉన్నారు. దానిని నియంత్రిస్తున్నారు' అంటూ ప్రస్తుత పరిణామాలపై ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2020 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఐదు బిలియన్ల మంది పేదలుగా మారగా, అదే సమయంలో ప్రపంచంలోని ఐదుగురు ధనవంతులైన బిలియనీర్లు తమ సంపదను రెట్టింపు చేసుకున్నారని ఆయన గుర్తుచేశారు. ఆయన ప్రకారం, ఈ బిలియనీర్లు ప్రతి గంటకు ఊహించలేని రేటుతో వి14 మిలియన్ల సంపదను సేకరిస్తున్నారు. ప్రపంచంలోని అత్యంత ధనవంతుడైన ఎలోన్ మస్క్, కొన్ని నెలల్లోనే తన సంపదకు గత అమెరికా ఎన్నికల అనంతరం వి 120 బిలియన్లను జోడించాడు. సాండర్స్ స్పష్టమైన ఆగ్రహంతో 'ఈ సంపద దొరికిందా?' అని ప్రశ్నించారు. రెండవ ధనవంతుడైన జెఫ్ బెజోస్ కూడా వెనుకబడి లేడు. అదే కాలంలో అతని సంపద వి 67 బిలియన్లు పెరిగింది. మరో ఆందోళనకర పరిణామం దారుణంగా జరుగుతున్న పన్నుల ఎగవేత. పలు నివేదికలను ఉటంకిస్తూ, కేమన్ దీవులు వంటి ఆఫ్‌షోర్ పన్ను స్వర్గధామాలలో వి32 ట్రిలియన్ల వరకు ఇటువంటి సంపన్నులు నిల్వ చేశారని, ఉద్దేశపూర్వకంగా తమ న్యాయమైన పన్నుల వాటాను చెల్లించకుండా తప్పించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. 'వేరే మాటల్లో చెప్పాలంటే, ప్రభుత్వాలకు నిధులు తక్కువగా చేస్తూ, ఈ వ్యక్తులు పన్ను స్వర్గధామాలలో ట్రిలియన్ల కొద్దీ దాచిపెట్టారు' అని సాండర్స్ స్పష్టం చేశారు. 'మా (అమెరికా) ఇటీవలి ఎన్నికలను కొనుగోలు చేయడానికి కేవలం 150 మంది బిలియనీర్ కుటుంబాలు దాదాపు వి2 బిలియన్లు ఖర్చు చేశాయి' అని సాండర్స్ తెలిపారు. ఈ సందర్భంగా డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతుగా ఎలోన్ మస్క్ వి277 మిలియన్లు ఖర్చు చేసిన మొత్తాన్ని సాండర్స్ 'పెట్టుబడి' అని పిలిచారు. ఇది మస్క్ తన ప్రయోజనాల కోసం చెల్లించిన మొత్తంగా అభివర్ణించారు. రక్షణ కాంట్రాక్టర్లు కూడా ఈ వ్యవస్థలో భాగస్వాములు అని సాండర్స్ ఆరోపించారు. ఎన్నికల చక్రంలో వి38 మిలియన్లు ఖర్చు చేసిన ఈ కార్పొరేషన్లు ఇప్పుడు ట్రిలియన్ డాలర్ల సైనిక బడ్జెట్ నుండి ప్రయోజనం పొందేందుకు సిద్ధంగా ఉన్నాయి. సాండర్స్ ప్రకారం, ఈ బడ్జెట్ వ్యర్థాలు, మోసాలతో నిండి ఉంది. ప్రజలకు జవాబుదారీతనం కంటే కొంతమందికి లాభాలకు ప్రాధాన్యత ఇస్తుంది.'ఇది ప్రజాస్వామ్యం కాదు అని సాండర్స్ ప్రకటించారు. ఇది ఒక వ్యక్తి, ఒక ఓటు కాదు. ఇది మనమందరం కలిసి మన భవిష్యత్తును నిర్ణయించుకోవడం కాదు. ఇది ఒక సామ్రాజ్యవాదం అని ఆయన స్పష్టం చేశారు. భారతదేశంలో సైతం పరిస్థితులు అందుకు భిన్నంగా లేవు. మన ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేశామని, మరో రెండు, మూడేళ్ళలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కాబోతుందని ప్రధాని నరేంద్ర మోడీ గర్వంగా చెప్పుకుంటున్నారు. అదే సమయం లో గత ఐదేళ్లుగా 80 కోట్ల మంది పేదలకు రేషన్ బియ్యం ఉచితంగా ఇస్తున్నామని, మరో నాలుగేళ్లు ఇవ్వబోతున్నామని తన ఉదారతను చాటుకుంటున్నారు. అంటే సుమారు 60% మంది ప్రజలు తిండి గింజల కోసం ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతున్నట్లు నిస్సిగ్గుగా చెప్పుకుంటున్నారు. నూతన ఆర్థిక సంస్కరణల అనంతరం గనులు వంటి సహజ వనరులు, విమానాశ్రయాలు, ఓడరేవులు వంటి భారీ మౌలిక సదుపాయాలు అన్ని కొద్దీ మంది బిలియనీర్ల హస్తగతం అయ్యాయి. కేవలం ఐదు శాతం మంది మాత్రమే తమ సంపదను పలు రెట్లు పెంచుకోగలుగుతున్నారు. కానీ సుమారు 80% మంది ప్రజల జీవితాలు అగమ్యగోచరంగా నిలుస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో 1950 తర్వాత సుమారు 70% మంది వరకు వ్యవసాయ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడుతూ మన జిడిపికి 59% వరకు సమకూరుస్తూ ఉండేవారు. అయితే నేడు వారి శాతం సుమారు 60 శాతం వరకు ఉన్నప్పటికీ వారి ఆదాయం మాత్రం జిడిపిలో 16 శాతానికి మించి లేదు. ఆ 16 శాతంలో కూడా నిఖార్సయిన వ్యవసాయం నుండి అందులో సగం 8% మాత్రమే. అంటే నేడు ప్రధాని చెబుతున్న మన ఆర్థికాభివృద్ధి అంత కొద్ది మందికి మాత్రమే పరిమితమవుతున్నది. అత్యధిక శాతం ప్రజలు దారిద్ర్యంలో మగ్గుతున్నారు. దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో మూడేళ్ళుగా రైతులు తమ డిమాండ్లపై ఆక్రందనలు చేస్తుంటే కనీసం వారితో చర్చలు జరిపేందుకు కూడా మన పాలకులకు తీరిక ఉండటం లేదు. మద్దతు ధరపై స్వయంగా ప్రధాన మంత్రి పార్లమెంట్ సాక్షిగా ఇచ్చినా హామీకి విలువలేకుండా పోయింది. రైతులను తీవ్రవాదులతో పోలుస్తూ ఆర్థిక నేరస్థులకు రాజమర్యాదలు చేస్తున్నారు. ప్రభుత్వ విధానాలను ఆర్థిక నేరస్థులే నిర్ణయించే ఓ విభ్రాంతికరమైన వ్యవస్థలు నేడు ప్రపంచంలో కొనసాగుతున్నాయి. ఇటువంటి పరిస్థితులు నేడు ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థల మనుగడను సవాల్ చేస్తున్నాయి. తాజాగా అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికలను చూస్తే ప్రజాస్వామ్య వ్యవస్థపై అక్కడి యువతలో విశ్వాసం సన్నగిల్లుతున్న ఆందోళనకర పరిస్థితులు వెల్లడి అవుతున్నాయి. ప్రపంచంలో ప్రజాస్వామ్య దేశాలకు అండగా నిలబడుతూ వస్తున్న అమెరికా నేడు అన్ని దేశాలలోని 'నిషేధిత' ఉగ్రవాద, తీవ్రవాద, వేర్పాటువాద నేతలకు స్వర్గంగా మారుతుంది. అక్కడి విశ్వవిద్యాల యాలలో వారు బహిరంగంగా కార్యకలాపాలు జరుపుతున్నారు. పైగా హింసాయుత చర్యలకు దిగుతున్నారు. డెమొక్రాటిక్ అభ్యర్థి ఓటమికి ఇటువంటి పరిస్థితులే ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థలకు గట్టి మద్దతుదారునిగా నిలబడిన అమెరికా ఇప్పుడు నిరంకుశ వ్యవస్థలను సహించ గలగడమో లేదా అవసరమైతే మద్దతు ఇచ్చేందుకు సిద్ధపడటంలో చేయగలుగుతుంది. దురదృష్టవశాత్తు బైడెన్ పరిపాలన యుద్ధనేరాలకు ఇజ్రాయెల్‌ను జవాబుదారీగా చేయడం లో విఫలం కావడంతోపాటు ఆర్థిక రంగంలో సాధించిన విజయాలను సగటు అమెరికా ఓటరుకు స్పష్టమైన ప్రయోజనాలుగా అనువదించడంలో స్పష్టమైన అసమర్థత కారణంగా డెమొక్రాట్ల పాలనపై భ్రమను మరింత తీవ్రతరం చేశాయి. ట్రంప్ స్పష్టంగా జాత్యహంకార, స్త్రీ ద్వేషపూరిత, 'అమెరికా ఫస్ట్' వాక్చాతుర్యంపై దృష్టి సారించారు. 2020 ఎన్నికలలో పోలింగ్ శాతం అంత ఎక్కువగా లేనప్పటికీ, 2024 పోల్స్‌లో ట్రంప్ వాషింగ్టన్ డిసితో సహా దాదాపు 50 రాష్ట్రాలలో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై గణనీయమైన శాతం ఓట్లను సాధించారు. అమెరికాలో ప్రజాస్వామ్యంపై విశ్వాసం క్షీణించడం, అంతర్జాతీయ వ్యవహారాలలో ట్రంప్ నేతృత్వంలో వాషింగ్టన్ నిష్క్రమణ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశాలపై పడే అవకాశం ఉంది. 'అమెరికాలో ప్రజాస్వామ్య సూత్రాలపై బలహీనమైన నమ్మకం ప్రపంచవ్యాప్తంగా నిరంకుశ పాలనలకు ధైర్యంగా మారుస్తుంది. ముఖ్యంగా ఆసియాలో ప్రజాస్వామ్య సంస్థల స్థిరత్వాన్ని సవాలు చేస్తోంది. ఆసియా దేశాలు అభివృద్ధి చెందుతున్న ప్రపంచ శక్తి గతిశీలత, చైనా ప్రభావం పెరుగుతుండడంతో, బలమైన అమెరికా నాయకత్వం అదృశ్యమయ్యే బలమైన సంభావ్యత ప్రజాస్వామ్య పథాలకు ప్రమాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది' అని ప్రముఖ మానవ హక్కుల, ప్రజా స్వామ్య ఉద్యమ నాయకురాలు సూ సన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో రక్షణ వ్యయం తగ్గించాలనే విధానాన్ని ట్రంప్ ప్రకటించడంతో తైవాన్, దక్షిణ కొరియాలతో అమెరికా సంబంధాలు ఆందోళనకరంగా మారే అవకాశాలు ఉన్నాయి. చైనా- అమెరికాల మధ్య సమనవ్య వేదికగా ఉంటూ వస్తున్న ఆసియన్ ఇప్పుడు చైనా వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది.

# సామాజిక ఉద్యమకారిణి సావిత్రి ఫూలే



మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి ఫూలే. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం సల్పిన అభ్యుదయ వాది ఆమె. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ మూర్తి. సమాజపు కట్టు బాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారత దేశపు మొట్ట మొదటి ఉపాధ్యాయు రాలుగా పాఠశాలలు ప్రారంభించిన ధీశాలి. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సమ న్యాయవాది. మహిళా శిరోముండ నానికి వ్యతిరేకంగా పోరాడిన సాంప్రదాయ వ్యతిరేకి. భర్త ఫూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపిన సంస్కరణ వాది. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే. సావిత్రి ఫూలే (3 జనవరి 1831 - 10 మార్చి 1897) గొప్ప సంఘ సంస్కర్త, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ ఫూలే భార్య. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమాజంలోని కులతత్వం, పురుషాధిక్యత ధోరణులకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాటం చేసారు. కలిగిన చాలామందికి ఆమె కేవలం జ్యోతిరావు ఫూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ ఆమె ఆధునిక భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి. సావిత్రీ బాయి మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న ఒక రైతు కుటుంబంలో జన్మించారు. ఆమె కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. బంధువులు నిజామాబాద్ జిల్లా లో బోధన్, నాందేడ్ కొండల్ వాడి ప్రాంతంలో , అదిలాబాద్ ప్రాంతపు చుట్టుపక్కల మున్నూరు కాపులు వారికి చుట్టాలు. ఆమె తన 9వ యేట 12 ఏళ్ళ జ్యోతిరావు పూలెను 1840లో వివాహ మాడారు. నిరక్షరాస్యురాలిగా ఉన్న ఆమెకు భర్త జ్యోతిరావు ఫూలే మొదటి గురువు. భర్త ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతు రాలైనారు. అహ్మద్ నగర్ లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1848 లో భర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించారు. ఆ పాఠశాల నడపటం ఉన్నత, అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీంతో ఆమెపై వేధింపులకు, భౌతిక దాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్లు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేశారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చే వారు. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా "నా విధిని నేను నిర్వహిస్తున్నాను" అని చెప్పే వారు. ఆమె సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ సమయం లోనే సహకారం గుర్తింపు లభించాయి. ఒక ముస్లిం వ్యక్తి తన ఇంటిని బడికి కేటా యించాడు. కొంత మంది పుస్తకాలు సేకరించారు. మోరోవితల్, వాల్వేకర్, దియోరావ్ వంటి ప్రముఖులు పాఠశాల నిర్వహణకు సహకరించారు. 1851లో మరో పాఠశాల ప్రారంభించారు. ఉపాధ్యాయురాలిగా అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు లాంటి హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, సనాతన సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయు రాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848న దేశంలో బహుజనులకు మొట్టమొదటి పాఠశాల ప్రారంభించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యను అందించారు. దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. ఆమె జీవిత కాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొనడమే కాక, 1849లో పూలే, సావిత్రీబాయి దంపతు గృహ బహిష్కారానికి గురి అయినారు. సామాజిక విప్లవకారిణిగా ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్య పరచడానికి 1852లో మహిళా సేవామండల్ పేరున మహిళా సంఘాన్ని కూడా స్థాపించింది. లింగ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచి వేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఆ సంస్థ కృషిచేసింది. కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో సత్యాన్ని శోధించడానికి 1873 లో తన భర్త మహాత్మా పూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్ "ను ప్రారంభించి బాల్య వివాహాలకు, మూఢ నమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునఃర్వివాహాల కొరకు అసమాన వ్యవస్థకు వ్యతి రేకంగా బలమైన ఉద్యమం నడిపారు. బాల్యం లోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దేవదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్య పరిచి వితంతువులకు శిరో ముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు. తరువాత 1873 సెప్టెంబరు 24న "సత్యసోధక్ సమాజ్" అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, ఉద్యమాన్ని నడిపారు. ఆ సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యసోధక్ సమాజ్ ఆధ్వర్యన సావిత్రీబాయి వివాహం జరిపించారు. 1868 నుంచి సావిత్రీబాయి అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడి నప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాల లోని అనాధ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాఠశాల ల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించా రు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా పేరెన్నిక గన్నా రు. 1854లోనే ఆమె తన కవితా సంపుటి 'కావ్యఫూలే'ను, మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించారు. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తక రూపంలో వచ్చాయి. జ్యోతీరావు పూలే 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగి పోయి కూడా, దుఃఖంలోనుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే. పూలే మరణాంతరం సత్యసోధాక్ సమాజ్ భాద్యతను స్వీకరించి నడిపించారు. 1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తో కల్సి వ్యాధి గ్రస్తులకు సేవ చేసారు. 1896-97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతాల్లోని దళితులు పేదలకు జోలెపట్టి విరాళాలు సేకరించి అందించారు. ప్లేగువ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. 1890వ దశకంలో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2 వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించారు. ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి కులాలకి చెందిన దళిత చిన్న పిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడారు. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకు సోకి మార్చి 10, 1897 లో మరణించారు. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించాడు. సావిత్రి బాయి జయంతిని భారతదేశ "మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం"గా జరుపుకుంటారు. 1997లో భారత ప్రభుత్వం సావిత్రిబాయి జ్ఞాపకార్థం తపాలా స్టాంపును విడుదల చేసింది. పూణే విశ్వ విద్యాలయానికి సావిత్రిబాయి పేరు పెట్టారు.

# అంతరిక్ష వాస్తుశిల్పి సతీష్ ధావన్

భారత దేశం గర్వించదగిన అంతరిక్ష శాస్త్రవేత్త సతీష్ ధావన్. ఆయన్ను భారత ఎక్స్పెరిమెంటల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ ప్రయోగాత్మక (ద్రవ డైనమిక్స్ పరిశోధన) కు పితామహుడిగా పరిగణిస్తారు.అల్లకల్లోలం మరియు సరిహద్దు పొరల రంగంలో అత్యంత ప్రసిద్ధ పరిశోధకులలో అగ్రగణ్యుడు గా భావిస్తారు. గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబల్ పి.హెచ్.డి సాధించి, ధావన్ గ్రామీణ విద్యలోను, రిమోట్ సెన్సింగు, ఉపగ్రహ సమాచారాల లోను పరిశోధనలు చేసాడు. వాటి ఫలితంగానే ఇన్‌శాట్, ఐఆర్‌ఎస్, పిఎస్‌ఎల్‌విలు రూపొందాయి. స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించాడు. భారతదేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. భారత దేశపు అత్యున్నత పురస్కారాలు పద్మవిభూషణ్, పద్మ భూషణ్, పొందాడు. విశిష్ట పూర్వ విద్యార్థి పురస్కారం, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్. విశిష్ట పూర్వ విద్యార్థి కాలిఫోర్నియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, 1969 అవార్డు పొందాడు. సతీష్ ధావన్ (1920 సెప్టెంబరు 25 - 2002 జనవరి 3) శ్రీనగర్ లో జన్మించిన ధావన్, భారతదేశం, అమెరికాలో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేసాడు. టర్బులెన్స్, బౌండరీ లేయర్స్ రంగాల్లో ఆయనను అత్యున్నత స్థాయి పరిశోధకుల్లో ఒకరిగా పరిగణిస్తారు. ఆయా రంగాల్లో ఆయన శక్తి సామర్థ్యాలు భారత స్వదేశీ అంతరిక్ష కార్యక్రమ అభివృద్ధికి దోహదపడింది. 1972 లో ఎమ్.జి.కె. మీనన్ తరువాత, ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ప్రొఫెసర్ సతీష్ ధావన్ సమాజాన్ని మార్చే మార్గంగా టెక్నాలజీని, ముఖ్యంగా హై టెక్నాలజీని చూసిన మానవతావాది. భారతదేశం యొక్క అత్యంత విజయవంతమైన అంతరిక్ష కార్యక్రమానికి వాస్తుశిల్పి సతీష్ ధావన్. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న లాహోరు లోని యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్ నుండి బాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ, మెకానికల్ ఇంజనీరింగ్ డిగ్రీ, ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్.ఏ డిగ్రీ పొందాడు. 1947 లో మిన్నియా పోలిస్ లోని యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా నుండి ఏరోస్పేస్ ఇంజనీరింగులో ఎమ్.ఎస్., కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఏరోనాటికల్ ఇంజనీరింగులో డిగ్రీ, ఆ తరువాత 1951 లో డా. హాన్స్ డబ్ల్యు లేప్‌మ్యాన్ మార్గదర్శకుడిగా గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబుల్ పి.హెచ్.డి పొందాడు. డా. ధావన్ స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా (1972-1984) భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా పని చేశాడు. స్పేస్ కమిషన్ ఛైర్మన్ గా బాధ్యతలు తీసుకోగానే అణుశక్తి కమిషనులో ఉన్న బ్రహ్మ ప్రకాష్‌ను తిరువనంతపురంలో ఉన్న విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రానికి ఛైర్మనుగా నియమించాడు. ఇస్రో శీఘ్రగతిన ఎదగడానికి ఆయన తీసుకున్న నిర్ణయం ఎంతో తోడ్పడింది. ఆ తరువాత భారత తొలి ఉపగ్రహ వాహక నౌక ఎస్‌ఎల్‌వి అభివృద్ధి కార్యక్రమానికి అబ్దుల్ కలాంను నాయకుడిగా నియమించాడు.1975 లో ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ నాయకత్వంలో ఎస్‌ఎల్‌వి అభివృద్ధి జరుగగా, దాని మొదటి ప్రయోగం విఫలమైంది. వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఆనాటి పత్రికా సమావేశంలో పాల్గొని ఆ వైఫల్యాన్ని తానే స్వీకరించాడు. రెండవ ప్రయోగం విజయవంత మైనపుడు ఆనాటి పత్రికా సమావేశాన్ని అబ్దుల్ కలాం చేత చేయించాడు. 1951 లో ధావన్ భారత్ శాస్త్ర విజ్ఞాన సంస్థలో ఉపాధ్యాయుడిగా చేరాడు. 1962 దానికి డైరెక్టరుగా నియమితుడై, 1962-1981 వరకు ఐఐఎస్‌సి చైర్మన్ గా పని చేశాడు. ఆయన ఇస్రో ఛైర్మనుగా ఉన్నప్పటికీ, బౌండరీ లేయర్ పరిశోధనలో తన శక్తియుక్తులు నియోగించాడు. ఆయన చేసిన పరిశోధనలను హెర్మన్ ష్లిక్టింగ్, తాను రాసిన బౌండరీ లేయర్ థియరీ పుస్తకంలో వివరించాడు. ధావన్ ఐఐఎస్‌సిలో భారతదేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. అయన గ్రామీణ విద్య, రిమోట్ సెన్సింగ్ మరియు ఉపగ్రహ సమాచార మార్పిడిలో మార్గదర్శక ప్రయోగాలు చేశారు. ధావన్ ప్రయత్నాలు ×చీూూ ఒక టెలికమ్యూనికేషన్ ఉపగ్రహం, ×=ూ- ఇండియన్ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం మరియు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ూూూఎ)వంటి కార్యాచరణ వ్యవస్థలకు దారితీశాయి, ఇవి భారతదేశాన్ని అంతరిక్ష వ్యవసాయ దేశాల లీగ్‌లో ఉంచాయి. 2002 లో ధావన్ మరణించాక, నెల్లూరు జిల్లా శ్రీహరికోట లోని అంతరిక్ష ప్రయోగ కేంద్రానికి ఆయన పేరుతో "సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం"గా పేరు పెట్టారు. లూధియానా లోని ప్రభుత్వ కళాశాలను ఆయన పేరిట మార్చారు. పద్మ విభూషణ్, 1981, పద్మ భూషణ్, 1971, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం, 1999 స్వీకరించాడు.

# మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం

శరీరం, మనస్సు, ఆత్మల సమతుల్యత మీదనే వ్యక్తుల సంపూర్ణ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని మనకు తెలుసు. మన శారీరక, మానసిక ఆరోగ్య సంరక్షణకు దోహదపడే దిన చర్యల్లో నడక, పరుగు, యోగా, సైక్లింగ్, ధ్యానం, ఆత్మావలోకనం, సృజనశీల కార్యక్రమాలు, వ్యాయామాలు లాంటి అంశాలు వస్తాయి. విద్యాలయాల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం నిత్యం గుర్తుచేసే నినాదం "ఆరోగ్యకర శరీరంలో ఆరోగ్యకర మనస్సు(సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ)" మనకు గుర్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరణ ప్రకారం "ఒక వ్యక్తి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, భావోద్వేగ, సామాజిక సమ్మిళిత ఆరోగ్యమే అసలైన సంపూర్ణ ఆరోగ్యమని" నిర్వచించింది. రోగం లేదా జ్వరం లేకపోవడం మాత్రమే సంపూర్ణ ఆరోగ్యానికి సంకేతం కాదని, మానసిక ఆరోగ్యం కూడా అత్యవసరమని తెలుస్తున్నది. మన శారీరక, మానసిక ఆరోగ్య ప్రాధాన్యాన్ని అవగాహన పరచడానికి ప్రతి ఏట 03 జనవరిన "అంతర్జాతీయ మనస్సు-శరీర ఆరోగ్య దినం (ఇంటర్నేషనల్ మైండ్-బాడీ వెల్‌నెస్ డే)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. మన శారీరం, మనస్సు, ఆత్మల సంతులిత సామరస్య ఆరోగ్యంపై మన భావోద్వేగాలు, పనులు, ఆధ్యాత్మిక ఆలోచనలు, అనుభవాలు, ధ్యేయాలు, నమ్మకాలు, అలవాట్లు, దిన చర్యలు ప్రభావాన్ని చూపుతాయి. 2025 నూతన సంవత్సరం అడుగిడుతున్న శుభ గడియల్లో ప్రతి ఒక్కరు తమ జీవనశైలిలో సానుకూల చిన్న చిన్న మార్పులు చేసుకుంటూ మనదైన శారీరక మానసిక సంపూర్ణ ఆరోగ్య సాధనకు కృషి చేయాలి. మన గురించి మనం ఆలోచించే సందర్భంగా నూతన సంవత్సర వేళల్ని వినియోగించుకోవాలి. ప్రతి చిన్న మార్పు రేపటి మన భారీ విజయానికి పునాదిగా పని చేస్తుందని గమనించాలి. 'మనలోనికి' మనం తొలగి చూడడం మరువరాదు. శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, భావోద్వేగ ప్రశాంతతల సమ్మేళనంగా సంపూర్ణ ఆరోగ్యం నిర్వచించబడింది. నేటి వేగవంతమైన డిజిటల్ నెటిజెన్ల పరుగు పరుగుల జీవన విధానంలో శ్వాస తీసుకునే సమయం లేదు, విరామమనే పదానికే అర్థం లేకుండా పోతున్నది. ఇలాంటి అంతర్జాల వలయంలో చిక్కిన మనిషి కొంత సమయం తీసుకొని తన గురించి తాను కొన్ని క్షణాలు ఆలోచించాలి, అవసరమైన స్వల్ప మార్పులతో దిన చర్యను పరిపూర్ణ ఆరోగ్య దిశగా మార్చుకోవాలి. మనస్సు-శరీర శ్రేయస్సుకు సరైన నిద్ర, కొన్ని నిమిషాల ధ్యానం/యోగా, ఒత్తిడిని తగ్గించే విరామాలు, సంతోషకరమైన కుటుంబం లాంటి క్రియలను దినచర్యలో భాగం చేసుకొని ఆచరణలో పెట్టాలి. ఒక మంచి పుస్తకాన్ని చదవడం, సుస్వర సంగీతాన్ని వినడం, మనకు నచ్చిన కాఫీ లేదా టీ తాగడం, ప్రకృతి అందాలను ఆస్వాదించడం, పూల సుగంధాలను అనుభవించడం, గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం, పూజ చేసి పైవాడికా కృతజ్ఞతలు తెలుపడం, ప్రాణ మిత్రుడితో మాట్లాడడం లాంటివి కూడా మన మనసుకు ఉపశమనాన్ని ఇచ్చి, శారీరక మానసిక వికాసానికి ఉపకరిస్తాయి. రేపటి పౌరులైన నేటి విద్యార్థినీవిద్యార్థులకు సరైన జీవనశైలి అలవర్చడంలో ఉపాధ్యాయుడు పాత్ర అమూల్యమని తెలుసుకోవాలి. విద్యార్థులు తమ గురించి తాము తెలుసు కోవడానికి తగు వేదికలను ఉపాధ్యాయుడు కల్పించాలి. విద్యార్థులు తమ అకడమిక్స్‌తో పాటు వ్యక్తిత్వ వికాసం, శారీరక మానసిక వికాసానికి దోహదపడే అంశాలను బోధించాలి. శారీరక ఆరోగ్యం, మానసిక సంతులిత సాధనకు విద్యాలయాలు వేదికలు కావాలి. మంచి అలవాట్లు, ఆచార వ్యవహారాలు, సాంస్కృతిక విలువలకు పట్టం కట్టే విధంగా యువతకు మార్గనిర్దేశనం చేయాలి. "మొక్కై వంగనిదే మానై వంగునా" అన్న నినాదాన్ని దృష్టిలో పెట్టుకొని పాఠశాల స్థాయిలోనే సన్మార్గాలను చూపి ఆచరించే విధంగా బోధనలు కొనసాగాలి.

# రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు





**రాజేంద్రనగర్,జనవరి 02** 2025 కొత్త సంవత్సర వేడుకలు రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఘనంగా జరిగాయి.గురువారం ఉదయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య కేక్ కట్ చేశారు.సిబ్బంది అందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అందరి కృషితో డిసెంబర్ లో నిర్వహించిన విశ్వవిద్యాలయ వజ్రోత్సవ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించగలిగామని ఆయనన్నారు. భవిష్యత్తులోనూ విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి అందరూ పునరంకితం అవ్వాలని జానయ్య పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోదనేతర,కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సందర్శించిన ఎంపీడీవో రాజిరెడ్డి..




**నిజాంపేట,జనవరి02(సూర్యరేఖ)** మండల పరిధిలోని బచ్చురాజుపల్లి గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో రాజిరెడ్డి పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి ఇందిరమ్మ ఇండ్ల సర్వే మండల వ్యాప్తంగా 80 శాతం పూర్తయిందన్నారు. ఈ సర్వే కార్యక్రమాన్ని త్వరతగతిన పూర్తిచేయాలని కార్యదర్శులకు సూచించారు. అలాగే సర్వేకి వచ్చిన అధికారులకు గ్రామస్తులు సహకరించి ఇండ్ల కొరకై దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రాము,బజార్ ప్రశాంత్ గౌడ్,గ్రామస్తుడు స్వామి,తదితరులు పాల్గొన్నారు.

## కవితా శీర్షిక:
## ఆదర్శం “సావిత్రిబాయి పూలే” (జనవరి 03జన్మదినం సందర్భంగా)



**నిజాంపేట,జనవరి2(సూర్యరేఖ)**
ఆమె తొలి తరం మహిళా ఉపాధ్యాయురాలు
భర్త అడుగు జాడల్లో నడిచి
సంఘాన్ని సంస్కరించిన సంఘసంస్కారిణి
అవమానాలు అభరణాలుగా భావించి
స్త్రీ ఉద్ధరణకు నడుం బిగించిన ఆదర్శ మహిళ
బాలికలకు ప్రత్యేక పాఠశాలలు స్థాపించి,
వెలుగులు నింపిన మహనీయురాలు..
అభ్యుదయ భావాలు కలిగిన అభ్యుదయవాది
నారీ వివక్షను నిరసించి
జాగృతం చేసిన జాగరూకురాలు..
నేటి మహిళలకు ఆదర్శప్రాయురాలు
సావిత్రిబాయి జయంతిన
ఆమె సేవలు స్మరించుకుందాం..
రచన:
యాడవరం చంద్ర కాంత్ గౌడ్
తెలుగు పండిట్
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాంపూర్

# కల్వకుంటలో ఘనంగా ఇరుముడి కార్యక్రమం



**శబరికి అయ్యప్ప సన్నిధికి తరలిన అయ్యప్ప స్వాములు..**



**నిజాంపేట,జనవరి02(సూర్యరేఖ)**మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో అయ్యప్ప స్వాములు 41 రోజుల పాటు మాలాధారణ స్వాములు కటోర ఉపవాస దీక్షలు చేసి గురువారం ఇరుముడి కార్యక్రమాన్ని గురుస్వాములు భీమయ్య, తీగలశ్రీనివాస్ గౌడ్,ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు మాట్లాడుతూ...గ్రామంలో అయ్యప్ప స్వాములు 41 రోజులపాటు మాలాధారణ ధరించి ఇరుముడితో అయ్యప్ప దర్శనానికి బయల్దేరామన్నారు.అయ్యప్ప స్వామి కృప గ్రామ ప్రజలపై ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో గురు స్వామి గన్నారం వెంకట్ గౌడ్,గద స్వామి శ్రీనివాస్ రెడ్డి,గంట స్వామి శ్రీనివాస్ గౌడ్,కన్నె స్వామి భాను గౌడ్,రెడ్డి శెట్టి రవీందర్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ టాపింగ్ కేసుపై రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిన సుప్రీంకోర్టు..



**హైదరాబాద్,జనవరి 02(సూర్యరేఖ)** ఫోన్ టాపింగ్ కేసులో దర్యాప్తు సుదీర్ఘకాలం కొనసాగించడం సరికాదని ఈ కేసు ఎప్పుడు ఒక కొలిక్కి వస్తుందని,ఇది ఎంతకాలం సాగదిస్తారని సుప్రీంకోర్టు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.ఏఎస్ పి తిరుపతన్న బెయిల్ పిటిషన్ పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.దర్యాప్తును తాము అడ్డుకోవాలని అలా అనుకోవాలని కూడా లేదని తిరుపతన్న పాత్రపై పూర్తి వివరాలు అందజేయాలని ప్రభాకర్ రావు అరెస్ట్ లో జాతీయం ఎందుకు జరుగుతుందని కోర్టు ఘాటుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని మొట్టికాయలు వేసింది.ఈ విషయమై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి తదుపరి విచారణను జనవరి 27కు వాయిదా వేసింది.

## రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావును కలిసిన వెంకట్ సాయినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

**ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కాలనీ ప్రతినిధులు**



**ఉప్పల్,డిసెంబర్ 02(సూర్యరేఖ)** రామంతపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావును నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలను బండారు శ్రీవాణి వెంకటరావుకు కాలనీ సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సానుకూలంగా స్పందించి దశలవారీగా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెంకట సాయినగర్ అధ్యక్షులు అల్లాడి నిరంజన్ గౌడ్, రమేష్ గౌడ్, తిరుమలేశుని,నారాయణ గౌడ్, బాల్లయ్య, సత్యనారాయణ నరసింహ, పుల్లయ్య, నాగరాజు, మోహన్,సైదులు గౌడ్ లతోపాటు రామాంతాపూర్ భగాయత్ నగర్ వెల్ఫేర్అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాశీ విశ్వనాథుడి ఆలయాన్ని దర్శించుకున్న కామారెడ్డి ఎమ్మెల్యే



**కామారెడ్డి,జనవరి02(సూర్య రేఖ)** ప్రధాని నరేంద్ర మోడీ కాశీ విశ్వనాథ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారని కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి తెలిపారు.కామారెడ్డి ఎమ్మెల్యే గురువారం వారణాసికి వెళ్లి కాశి విశ్వనాథ ఆలయాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం పూజలు నిర్వహించారు.కాశీ విశ్వనాధుని దర్శించుకోవడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే రమణారెడ్డి అన్నారు.కాశీ విశ్వనాథుడి అనుగ్రహంతో తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


## ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు..





**ఉప్పల్,జనవరి02 (సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని గురువారం ఉదయం ఏఎస్ రావునగర్ మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్, రామంతపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ తవిడబోయిన గిరిబాబులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి పలు సూచనలు చేశారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్,డిసెంబర్ 02(సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని గురువారం ఉదయం జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ముఖ్యమంత్రి ఉప్పల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజలకు తెలిసేలా అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని,పథకాలు లబ్ధిదారులకు చేరేలా చూడాలని సూచించారు.ఉప్పల్ నియోజకవర్గంలోని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి అవసరమైన నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.


## అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలి

**ఎమ్మెల్యే దాన్పాల్ సూర్యనారాయణ గుప్తా**



**కామారెడ్డి,జనవరి02(సూర్య రేఖ)** అమృత్ టు పథకం కింద నిజామాబాద్ నగరంలో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అర్బన్ ఎమ్మెల్యే దాన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు.నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం పబ్లిక్ హెల్త్ అధికారులు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే దాన్పాల్ సూర్యనారాయణ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వాటర్ వర్కర్స్ వాటర్ ట్యాంకులు నిర్మాణం పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని తెలిపారు.

# ఉప్పల్ మున్సిపల్ మైదానంలో మద్యం పార్టీకి అనుమతి ఇచ్చిన డిప్యూటీ కమిషనర్ ను వెంటనే సస్పెండ్ చేయాలి




**జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ డిమాండ్**

**ఉప్పల్,డిసెంబర్ 02(సూర్యరేఖ)** ఉప్పల్ జిహెచ్ఎంసి మైదానంలో డిసెంబర్ 31న జరిగిన మద్యంతో కూడిన ప్రైవేటు ఈవెంట్ ఆర్గనైజర్ కి అనుమతి ఇచ్చినందుకు వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతూ కమిషనర్ ఇలంబర్తికి జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్,చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ. అనుమతినిచ్చిన ఉప్పల్ డిప్యూటీ కమిషన్ ను వెంటనే సస్పెండ్ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఉప్పల్ మున్సిపల్ మైదానం ఎప్పుడు కూడా మద్యంతో కూడిన కార్యక్రమాల కు అనుమతులు ఇవ్వలేదని, ఈసారి ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ మద్యంతో కూడిన ప్రైవేటు ఈవెంట్ ఆర్గనైజర్ కి అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేట్ వ్యక్తులకు ఈవెంట్ల పేరుతో మద్యం అమ్మకాలకి ప్రభుత్వ స్థలాలను కేటాయించొద్దని కోరుతూ, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులుపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.గతంలో ఎన్నడూ కూడా ఉప్పల్ మున్సిపల్ మైదానంలో స్పోర్ట్స్, స్కూల్ కల్చరల్, ఆక్టివిటీస్,ధార్మిక కార్యక్రమాలకు తప్ప ఎన్నడూ మద్యంతో కూడిన ఈవెంట్లకు అనుమతి ఇవ్వలేదని,ఇటువంటి చర్యలకు పాల్పడిన డిప్యూటీ కమిషనర్ ని వెంటనే సస్పెండ్ చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇల్లం భర్తీని కోరినట్లు కార్పొరేటర్ బన్నాల గీతా ముదిరాజ్ తెలిపారు.

# టీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్,జనవరి 02** సమగ్ర మీడియా సమాచారంతో, దాదాపు నలభై యేండ్లుగా ప్రతి ఏటా జనవరి మొదటి వారంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) సంఘ ఆనవాయితీగా డైరీని ఆవిష్కరిస్తున్న విషయం తెలిసిందే.ఇందులో భాగంగా 2025 మీడియా డైరీని గురువారం రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలోని తన ఛాంబర్ లో సమాచార శాఖ కమిషనర్ ఎస్.హరీష్ తో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఐజేయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే)రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఐజేయు జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి,జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ,టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్లూరి రాములు,కార్యదర్శి కె.శ్రీకాంత్ రెడ్డి,కోశాధికారి యం.వెంకట్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రాజేష్,బి.కిరణ్,గౌస్ మోహియుద్దీన్, అనీల్,హెచ్.యూ.జే అధ్యక్ష,కార్యదర్శులు శిగా శంకర్ గౌడ్,హమీద్ షౌకత్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి,సమాచార శాఖ కమిషనర్ హరీష్ కు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. విరాహత్ అలీ,కె. రాంనారాయణ లు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజలు కాంగ్రెస్ పాలనతో బేజారు




**ఏడాది పాలన.. నరక యాతన..**
**నూతన సంవత్సరంలో బీఆర్ఎస్ ను బలోపేతం చేసుకోవాలి..**
**కాంగ్రెస్ పాలన వైఫల్యాలను తిప్పికొట్టాలి..**
**కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన పి.సబితా ఇంద్రారెడ్డి, పి.కార్తీక్ రెడ్డి**



**రాజేంద్రనగర్,జనవరి02** నూతన సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని పార్టీ యువ నాయకులు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి లు అన్నారు.ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్ పాలనతో విసిగి పోయారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ వైపే ప్రజలు తిరిగి మొగ్గు చూపుతున్నారని వారు వివరించారు. గురువారం నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం చెందిన పలువురు నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి,కార్తీక్ రెడ్డిని కలిశారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి,కార్తీక్ రెడ్డి,లు పార్టీ శ్రేణులకు నూతన సంవత్సరంలో వ్యవహరించాల్సిన తీరుపై దిశ నిర్దేశం చేశారు.కాంగ్రెస్ పాలనకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైందని అన్నారు.దీంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఎందుకు గెలిపించామనే భావనలో ఉన్నారని వివరించారు. బీఆర్ఎస్ పాలన గుర్తుకు వస్తుందంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారని వివరించారు.తిరిగి రాష్ట్రంలో బీఆర్ఎస్ జండా ఎగిరేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని సూచించారు.సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు.ఏడాది కాలంలో కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసిగి పోయారని వారు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ,రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, రాఘవేందర్ యాదవ్, లక్ష్మి రాజ్, సరిత, సులేమాన్ నగర్ అధ్యక్షుడు జహీర్, శాస్త్రిపురం అధ్యక్షులు ముక్రంఖాన్, అరుణ్ ముదిరాజ్, మైసిరెడ్డి,భగవాన్ దాస్, సరికొండ దుర్గేష్, సురేష్, పటేల్, ఉప్పల్ శీను,కార్తీక్ ముదిరాజ్, అశోక్ కుమార్, మహేష్, రాయుడు,రాజ్ కుమార్,రిషి, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులను పరామర్శించిన ఆవుల రాజిరెడ్డి..



**శివంపేట,జనవరి 02(సూర్యరేఖ)** శివంపేట మండలం చిన్న గొట్టిముక్కుల గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో చిన్న గొట్టిముక్కుల గ్రామస్తులు గాయపడ్డారు.ఈ విషయం తెలుసుకొని మండల కేంద్రమైన శివంపేటలోని శ్రీ సాయి నర్సింగ్ హోమ్ లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. గాయపడిన వారిని అధర్యపడవద్దని అండగా మేముంటానని భరోసా కల్పించారు.నాణ్యమైన చికిత్స అందించాలని వైద్యులను నర్సాపూర్ తాలూకా ఇన్చార్జ్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఆవుల రాజు రెడ్డి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో శివంపేట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా,పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామి రెడ్డి,వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి,మాజీ ఎంపిటిసి లక్ష్మీకాంతం,మాజీ జెడ్పిటిసి కమలాపూల్ సింగ్,వారాల గణేష్,షేక్ అలీ ఈసారం రాజుగౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పౌల్ట్రీ అభివృద్ధికి కేంద్రం చొరవ..

**బిజెపి జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి,వై.శ్రీధర్**



**రాజేంద్రనగర్,జనవరి02** రాష్ట్రంలో పౌల్ట్రీ డెవలప్మెంట్ కు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ లు అన్నారు. అభివృద్దే ప్రధాన ఎజెండాగా పనిచేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణకు అన్ని రకాల నిధులను,సహాయ సహకారాలను అందిస్తుందని వారు వివరించారు.రాజేంద్రనగర్ పౌల్ట్రీ డెవలప్మెంట్ ప్రాజెక్టు జాతీయ గిరిజన కమిషన్ బోర్డు సభ్యులు హుస్సేన్ ను వారు గురువారం సన్మానించారు.ఈ సందర్భంగా పౌల్ట్రీని అభివృద్ధి చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్రంలో పౌల్ట్రీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ మేరకు చేపట్టాల్సిన చర్యలను అధికారులు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో యువమోర్చా నాయకుడు బాల్ రెడ్డి,డివిజన్ అధ్యక్షుడు బాబురావు,డివిజన్ ఎస్టి మోర్చా అధ్యక్షుడు ప్రకాష్,డి.యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

## దేవునిపల్లి కాసర్ల విహార్ లో వింటర్ గ్రీన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్



**కామారెడ్డి,జనవరి02(సూర్య రేఖ)** క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కామారెడ్డి మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ కాసర్ల గోదావరి స్వామి అన్నారు.గురువారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి కాసర్ల విహార్ లో వింటర్ గ్రీన్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ జెర్సీ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 12వ వార్డు కౌన్సిలర్ కాసర్ల గోదావరి స్వామి,35వ వార్డు కౌన్సిలర్ పోలీసు కృష్ణాజిరావు,10వ వార్డు భారతీయ జనతా పార్టీ ఇంచార్జ్ కాసర్ల రవీందర్ తో పాటు పెద్దోళ్ల శశిధర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాసర్ల స్వామి మాట్లాడుతూ..ఈ టోర్నమెంట్ 3వ తేదీన ముగియనుందని తెలిపారు.అనంతరం ఆయన నిరుపేద విద్యార్థులకు నోటుబుక్కులు అందించారు.12వ వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

## ఆంధ్రప్రదేశ్ తిరుమల తిరుపతి దేవస్థానం వారి రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీల్లో జంగి కారుణ్యకు మొదటి బహుమతి



**ఆందోల్,జనవరి02(సూర్య రేఖ)** సంగారెడ్డి రాయకోడు మండలం జంగికే గ్రామానికి చెందిన సుధా కర్ కుమార్తె కారుణ్య సంగారెడ్డి జిల్లా కేశవరెడ్డి స్కూల్లో తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించిన డాన్స్ పోటీలలో కేశవరెడ్డి రెడ్డి స్కూల్ నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యింది.కారుణ్య నృత్యాల పోటీలో మొట్టమొదటి బహుమతి అవార్డు లభించింది.కారుణ్య తండ్రి వికలాంగుడు కావడం,పేద కుటుంబం అయినా కారుణ్య ప్రతిభ చాటడం పట్ల అందరూ అభినందిస్తున్నారు. ఎన్నో కష్టాలు పడి తన కూతుర్ని చిన్ననాటి నుంచి పెంచుతుండ టంతో చదువుపై శ్రద్ధతో ఆట పోటీల్లో అన్ని రకాలుగా కూతురుకు సహకరించి ఆమె పైకి రావడానికి కృషి చేస్తున్నారు.రాష్ట్రస్థాయిలో జంబికే గ్రామ పేరు నిలబెట్టినందుకు ప్రజలు,రాయకూడ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# నూతన సంవత్సరంలో ప్రజల సమస్యల పరిష్కారానికి పనిచేయాలి

**కాంగ్రెస్ ఏడాది పాలనలో గుణాత్మక మార్పులు..**
**ప్రజా క్షేత్రంలో ప్రతిపక్షాల కుట్రలను తిప్పి కొట్టాలి..**
**నూతన సంవత్సర వేడుకల్లో కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**




**రాజేంద్రనగర్,జనవరి02** నూతన సంవత్సరంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజలందరి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ సూచించారు.ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని వెల్లడించారు.నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్‌కు పలువురు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు.అందులో భాగాంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి,నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు పలు సలహాలు సూచనలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా పార్టీ నాయకులు పనిచేయాలని అన్నారు.ఈ మేరకు అన్ని విధాల ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే గుణాత్మక మార్పులను రాష్ట్రంలో తీసుకువచ్చిందని అన్నారు.రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ పాలనకు ప్రజలు అనుకూలంగా ఉన్నారని తెలిపారు.ప్రజా క్షేత్రంలో ప్రతిపక్షాలు చేసే ఆరోపణలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని వివరించారు.ఈ మేరకు ఎప్పటికప్పుడు ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి అవగాహన కల్పిస్తూ ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొండకల్ల నాగేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,ఉపాధ్యక్షులు చందు యాదవ్,ఆకాష్ కుమార్, రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు మహేశ్ కుమార్,నార్సింగి మండల అధ్యక్షుడు అమరనాథ్ రెడ్డి,మండల అధ్యక్షుడు అజయ్,నాయకులు హరీష్ రెడ్డి,బబ్లూ ముధిరాజ్,సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు శాఖలో ఏం జరుగుతోంది?.






**కామారెడ్డి,జనవరి02(సూర్య రేఖ)** కామారెడ్డి జిల్లాలో పోలీసు శాఖలో ఏమి జరుగుతోంది..?ప్రజలకు సమస్యలు వస్తే పోలీసుల దగ్గరకు వెళ్తారు.ఏ కష్టం వచ్చినా. ఎంత నష్టం వచ్చినా..ఎలా ధైర్యంగా బతకాలో పోలీసులు జనాలకు చెప్తారు. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనతో ఉన్న వారి మనసును మార్చి జీవితం పైన భరోసాను పోలీసులు కలిగిస్తారు.జీవితం అంటే ఏమిటో జీవిస్తే తెలుస్తుందని, తాత్కాలిక సమస్యలకు ఆత్మహత్యలు శాశ్వత పరిష్కారాలు కావని చైతన్య పరుస్తారు. పోలీసులు బాధల్లో ఉన్న వారికి భరోసానిచ్చి జీవితంపై ఆశలు కల్పిస్తారు. అందుకే పోలీసులను ప్రజలు ఇంతగా నమ్ముతారు, గౌరవిస్తారు.కానీ ఇటీవలి కాలంలో ఆ పోలీసుల జీవితాలే ప్రమాదంలో పడుతున్నాయి.సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.పోలీసు శాఖను కాదు యావత్తు సమాజాన్ని నివ్వేర పరిచేలా చేస్తుంది.కామారెడ్డి జిల్లాలో ఈనెల 25న రాత్రి చోటు చేసుకున్న త్రిబుల్ డెత్ కేసు విచారణ ఓ పక్క కొనసాగుతుండగా మరోపక్క తాజాగా మెదక్ జిల్లాలో ఆదివారం జరిగిన రెండు వేరువేరు ఘటనల్లో ఇద్దరు కానిస్టేబుల్ బలవన్మరణలకు పాల్పడ్డారు.కామారెడ్డి జిల్లాలో భిక్కనూరు ఎస్సై సాయికుమార్,బిబిపేట పోలీసు స్టేషన్లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శృతితో పాటు కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ లు సదాశివ నగర్ మండలం పరిధిలోని అడ్లూరు ఎల్లారెడ్డి పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకొని చనిపోవడం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది.ఈ ఘటన నుంచి పోలీసు శాఖ తేరుకోకముందే తాజాగా ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు ఆత్మహత్యలు పోలీసు శాఖను మరింత కుదిపేశాయని చెప్పవచ్చు.ఈ ఆత్మహత్యల వెనుక కారణాలను ప్రజల్లో వినిపిస్తున్న ఆరోపణలను విశ్లేషిస్తే వీరికి పరాయి మహిళలతో ఉన్న వివాహేతర సంబంధాలే కారణాలని ఆరోపణలు వస్తున్నాయి.ఇటివలి కాలంలో పోలీసులు వరుస ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనకు కారణం పర స్త్రీలతో సాంగత్యమే కారణమని తెలుస్తున్నప్పటికీ, దీనికి తోడు మరో కోణం కూడా కారణం కావచ్చని అనుమానాలు పోలీసు శాఖలో వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇటివలి కాలంలో పొలిటికల్ ప్రోటోకాల్ తో పాటు బందోబస్తు డ్యూటీలు ఉన్నత అధికారుల నుంచి విశాఖపట్నం పొలిటికల్ లీడర్తో ఎదురవుతున్న రాజకీయ ఒత్తిళ్లు కూడా ఎస్సై,సీఐ ఆపై స్థాయి అధికారులకు తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తుంది. వీటి కారణంగానే మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నట్లు తెలుస్తోంది.నిజానికి పోలీసు శాఖ ఇప్పుడు ప్రమాదంలో పడిందని చెప్పాలి.ఎందుకంటే ఇప్పటికే పోలీసు శాఖలో చాలామంది స్త్రీలతో సంబంధాలు కలిగి ఉన్నారని తెలుస్తోంది.వీటిలో ఇప్పటివరకు బయటకు వచ్చినవి కొన్ని అయితే బయటపడని రహస్య సంబంధాలు ఇంకా చాలానే ఉన్నాయి.ఉన్నత అధికారులు ఇప్పుడైనా తేరుకొని నష్ట నివారణ చర్యలకు చొరవ చూపకపోతే పోలీసు శాఖ పరువు మూసి నదిలో కలవడం ఖాయంగా కనిపిస్తోంది.పోలీసుల కదలికల పైన వారికి ఉన్న రహస్య సంబంధాల పైన నీడల నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉంది. ఇప్పటికైనా పోలీసులు స్థైర్యాన్ని నింపేలా ఎంతటి క్లిష్ట సమస్య నైనా ఎదుర్కొనేలా మానసికంగా సిద్ధం చేయడానికి ప్రముఖుల చేత కౌన్సిలింగ్ క్లాసులు ఇప్పించాల్సిన అవసరం ఉంది.ఈ విషయంపై పోలీసు శాఖతో పాటు ప్రభుత్వం కూడా ఫోకస్ పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

# జోరందుకున్న వరి సాగు



**మెదక్,జనవరి02(సూర్యరేఖ)** మెదక్ జిల్లాలో యాసంగిలో వరి సాగు జోరందుకుంది. ఎక్కడ చూసినా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అందుకు తగ్గట్టుగానే వరి నారుమళ్లు పోసుకుని పొలాలను దున్ని నాట్లు వేస్తున్నారు. వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఆశించిన దానికంటే ఎక్కువగా పంటలు పండాయి. ప్రస్తుతం చెరువులు, బోర్లలో పుష్కలమైన నీరు ఉంది.అలాగే ప్రాజెక్టులు కూడా నీటితో కళకళలాడుతున్నాయి.దీంతో కర్షకులు వరిసాగుపై ఆసక్తి చూపుతున్నారు.జిల్లాలో చేగుంట, పాపన్నపేట, వెల్దుర్తి, మెదక్, కొల్చారం, హావేలిఘనపూర్, చిన్నశంకరంపేట, రామాయంపేట, శివ్వంపేట, నిజాంపేట, కౌడిపల్లి, చిలప్‌చెడ్ నార్సింగి, నర్సాపూర్, మాసాయిపేట తదితర మండలాల్లో యాసంగిలో వరి సాగు చేస్తున్నారు. ఇందుకోసం కొందరు దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటుండ గా,మరికొందరు నాట్లు సైతం పూర్తిచేశారు. చేగుంట మండలం బోనాలలో దాదాపుగా 60 శాతం నాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుత యాసంగిలో జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల పంటలు 2,84,836 లక్షల ఎకరాల్లో పండించనున్నారు. ఇందులో ఒక్క వరి 2.65 లక్షల మేర సాగు చేసేందుకు వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.అయితే అంతకంటే ఎక్కువగా సాగయ్యే అవకాశాలున్నాయి. జిల్లాలో చాలా గ్రామాల్లో చెరువుల కింద కూడా వరి నాట్లకు సమాయత్తం అవుతున్నారు.గతేడాది చేగుంట, రామాయంపేట మండలాలకు కాళేశ్వరం జలాలు వచ్చాయి. ఆ నీటితో చెరువులను నింపారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో చివర్లో నీటి విడుదల ఉంటుందోలేదోనని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన

**రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి**



**రాజేంద్రనగర్,జనవరి02** నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి శాలువాతో సత్కరించారు.అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలకు,పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కల్వకుంట్ల కవిత మాట్లాడారు.అసమర్థ కాంగ్రెస్ సర్కారు పాలనపై అలుపెరుగని పోరాటం చేద్దామని,అందుకు పార్టీ నేతలు, శ్రేణులు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.మళ్లీ కేసీఆర్ ప్రభుత్వాన్ని తీసుకొచ్చే ఏకైక లక్ష్యంతో పార్టీ శ్రేణులంతా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

## కామారెడ్డి జిల్లాలో నకిలీ విత్తనాలు

**మోసపోయిన రైతులు**




**కామారెడ్డి,జనవరి02(సూర్య రేఖ)** కామారెడ్డి జిల్లాలో నకిలీ విత్తనాలతో తీవ్రంగా మోసపోయామని పలువురు రైతులు ఆరోపించారు.కామారెడ్డి నియోజకవర్గం బిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన రైతు నర్సారెడ్డి నవంబర్ నెలలో మొక్కజొన్న పంట కోసం సిరి రైటర్ విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేశారు.కాగా నెల రోజులుగా గడిచిన విత్తనాలు మొలకెత్తలేదని ఈ విషయంపై కంపెనీ వారికి ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని రైతులు వాపోయారు.వెంటనే అధికారులు స్పందించి కంపెనీ యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.అలాగే లింగాపూర్ గ్రామానికి చెందిన కాసర్ల రాజేందర్ తన సొంత పొలంలో మొక్కజొన్న పంట వేశాడు. ఆయన పొలంలో కూడా మొలకెత్తలేదు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గాంధీ నాయక్ డిమాండ్ చేశారు.రైతులకు వెంటనే వారి డబ్బులు వారికి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## శబరిమలై యాత్రకు బయలుదేరి వెళ్లిన అయ్యప్ప స్వాములు





**రామాయంపేట,జనవరి02(సూర్య రేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో శ్రీ అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప ఇరుముడి కార్యక్రమం భక్తజన సమ్మోహంతో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గురువారం జితేందర్ గురు స్వామి,కృష్ణమూర్తి గురుస్వామి, నగేష్ గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాసంలో మొదలయ్యే అయ్యప్ప దీక్షలు 41 రోజులపాటు నియమ నిష్టలతో మాలదారణ ధరించి 41 రోజుల తర్వాత ఇరుముడిని తీసుకొని 38 మంది స్వాములు శబరిమలైకి బయలుదేరి వెళ్లారు.శబరిమలై యాత్ర సందర్భంగా ఈ అయ్యప్ప దేవాలయం అంతా భక్తులు బంధువులతో ఆలయం కిక్కిరిసిపోయింది.అయ్యప్ప స్వాములకు పాదాభివందనం చేశారు.అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సబితారెడ్డి,పి.కార్తీక్ రెడ్డి,లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ పాత్రికేల బృందం






**రాజేంద్రనగర్,జనవరి 02**నూతన సంవత్సరం సందర్భంగా మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పి.కార్తీక్ రెడ్డిలను రాజేంద్రనగర్ సీనియర్ జర్నలిస్టుల బృందం గురువారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జర్నలిస్టుల బృందం ప్రతినిధులు అప్పరెడ్డి గూడెం భీమయ్య ఎం.దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ పాత్రికేల బృందం నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. రాజేంద్రనగర్ ప్రజలు, పాత్రికేయ బృందానికి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, పి.కార్తీక్ రెడ్డి లు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.2025లో మీకు ఆనందకరమైన, ఆరోగ్యకరమైన జీవితం కలగాలని కోరుకుంటున్నానని అన్నారు.నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపిన వారిలో సీనియర్ జర్నలిస్టులు పి.సూర్యనారాయణ, మేక్కొండ ప్రేమ్ రాజ్,వర్కల చందు, పద్మారం వెంకటేష్, కోరని మహేష్ ,తదితరులు ఉన్నారు.

# సత్వరమే న్యాయం అందించడమే న్యాయ వ్యవస్థ ప్రధాన లక్ష్యం



అద్దె భవనంలోకి మార్చిన నూతన కోర్టు సముదాయాన్ని ప్రారంభించిన రంగారెడ్డి జిల్లా సెషన్ జడ్జి శశిధర్ రెడ్డి




**రాజేంద్రనగర్,జనవరి 02** నాయ వ్యవస్థ ద్వారా సత్వర న్యాయం అందించడమే తమ లక్ష్యమని రంగారెడ్డి జిల్లా సెషన్ జడ్జి శశిధర్ రెడ్డి పేర్కొన్నారు.రాజేంద్రనగర్ ఉప్పరపల్లి 8వ మెట్రోపాలిటన్ కోర్టు నూతనంగా ఉప్పరపల్లిలోని క్రికెట్ గ్రౌండ్ లో నిర్మించిన అద్దె భవనంలోకి మార్చిన నూతన సముదాయాన్ని రంగారెడ్డి జిల్లా సెషన్ జడ్జి శశిధర్ రెడ్డి,ఫాస్ట్ ట్రాక్ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆంజనేయులు,మెజిస్ట్రేట్లు నీలిమ,అంకిత్ దర్వా,రాజుకిరణ్ లతో కలిసి గురువారం ప్రారంభించారు.

**ఈ సందర్భంగా జడ్జి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ...**

న్యాయస్థానాలు ప్రజలకు చెరువుగా ఉండే..కేసులు త్వరితగతన పరిష్కారమై కక్ష దారులకు సత్వరన్యాయం లభిస్తుందన్నారు.ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం పోతే ప్రజాస్వామ్యం మనుగడ కష్టమని,ఆ పరిస్థితి తలెత్తకుండా న్యాయ వ్యవస్థ పనిచేసేలా అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఉప్పర్ పల్లిలోని 8వ మెట్రోపాలిటన్ కోర్టు సరిపోనందుకు మరో అద్దె భవనంలోకి మార్చడం జరిగిందని వెల్లడించారు.కేసుల పరిష్కారంలో న్యాయవాదుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు.సామాన్యులకు సత్వర న్యాయం అందేలా న్యాయవాదులు నిబద్ధతతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పరపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం వెంకట్ రెడ్డి,కార్యదర్శి శ్రీధర్, రాజశేఖర్,వెంకటేష్,నాయక్,కృష్ణ,ప్రతాప్ గౌడ్, భానుప్రియ, సీనియర్ న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆస్ట్రేలియాతో ఐదో టెస్ట్.. తుది జట్టు ఇదేనా?

# రోహిత్‌ను పక్కనపెట్టే రిస్క్ చేస్తారా?

బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీలో భాగంగా శుక్రవారం నుంచి సిడ్నీ వేదికగా చివరి టెస్టు జరుగనున్నది. ఇప్పటికే సిరీస్‌లో 2–1 ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియా ఎలాగైనా ఈ టెస్టును సైతం గెలిచి ట్రోఫీని ఎగరేసుకుపోవాలని ఉవ్విళ్లూరుతుంది. ఇక టీమిండియా సిడ్నీలో ఆస్ట్రేలియాను ఓడించి సిరీస్‌ను సమం చేసి పరువు కాపాడుకోవాలని ప్రయత్నంలో ఉన్నది. చివరి టెస్టులో టీమిండియా పలు కీలక మార్పులు చేసే అవకాశం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతుంది. ముఖ్యంగా గత కొంతకాలంగా ఫామ్ లేమితో విమర్శలు ఎదుర్కొంటున్న కెప్టెన్ రోహిత్ శర్మను పక్కన పెట్టే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. రేపటి టెస్టులో తుది జట్టులో రోహిత్ ఉంటాడా? లేదా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ సైతం ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా.. దాటవేయడం ఆ వార్తలకు మరింత బలాన్ని ఇచ్చినట్లయ్యింది. బోర్డర్ %–% గవాస్కర్ టెస్ట్ సిరీస్ చివరి మ్యాచ్‌లో టీమిండియా రెగ్యులర్ కెప్టెన్ లేకుండానే బరిలోకి దిగుతుందా..? నిజంగానే ఆ సాహసం చేస్తుందా? అనేది మరికొద్ది గంటల్లో తేలనున్నది.

**ఫామ్‌లేమితో హిట్‌మ్యాన్ సతమతం..**

రోహిత్ గతకొంతకాలంగా పరుగులు సాధించడంలో విఫలమవుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో చివరి టెస్టులో చోటు దక్కుతుందా? పక్కన పెడుతారా? అన్న చర్చ సాగుతుంది. హెడ్‌కోచ్ గంభీర్ ఈ విషయంలో ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోయినా.. రోహిత్‌ని టీమ్ మేనేజ్‌మెంట్ పక్కనపెట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. సిడ్నీ టెస్టుకు ముందు విలేకరుల సమావేశంలో పాల్గొన్న హెడ్ కోచ్ గంభీర్‌ను ప్లేయింగ్–11లో రోహిత్ పేరు ఉంటుందా? అని ప్రశ్నించగా.. క్లారిటీ ఇవ్వలేదు. తుది జట్టును మ్యాచ్‌కు ముందు పిచ్‌ను పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పాడు. సిరీస్‌లో రోహిత్ పేలవ ఫామ్ భారత్‌కు ఆందోళన కలిగిస్తోంది. గత మూడు సిరీస్‌లో 15 ఇన్నింగ్స్‌ల్లో 10.93 సగటుతో 164 పరుగులు మాత్రమే హిట్‌మ్యాచ్ చేయగలిగాడు. ఈ మూడు సిరీస్‌లో రెండు భారత్‌లోనే జరిగాయి. రోహిత్ కేవలం ఒక హాఫ్ సెంచరీ మాత్రయే చేయగలిగాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో కేవలం 31 పరుగులు చేశాడు. ప్రెస్‌మీట్ అనంతరం గంభీర్ సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌కు చేరుకొని ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. ప్రాక్టీస్ సమయంలో రోహిత్ స్లిప్‌లో లేకపోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. తొలి స్లిప్‌లో కోహ్లీ, రెండో స్లిప్‌లో కేఎల్ రాహుల్, మూడో స్లిప్‌లో నితీశ్ రెడ్డి ఉన్నారు. ఇక పంత్ వికెట్ కీపింగ్ చేయగా.. యశస్వీ జైస్వాల్ గల్లీలో ఫీల్డింగ్ చేస్తూ కనిపించాడు.

**రోహిత్ ప్లేస్‌లో చోటెవరికి..?**

టీమిండియా రోహిత్‌ను పక్కనపెట్టాలని నిర్ణయిస్తే.. శుభ్‌మన్ గిల్‌కు తుదిజట్టులో చోటు దక్కే అవకాశాలు ఉన్నాయి. దాంతో కేఎల్ రాహుల్‌తో కలిసి జైస్వాల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించేందుకు అవకాశం ఉంది. ప్రాక్టీస్ సెషన్‌లో కోచ్ గంభీర్‌తో గిల్ ముచ్చటిస్తూ కనిపించాడు. మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగో టెస్టు మ్యాచ్‌లో గిల్ విశ్రాంతి ఇచ్చి రోహిత్ ఓపెనింగ్స్‌కు వచ్చిన విషయం తెలిసిందే. నాలుగో టెస్టులో బెంచ్‌కే పరిమితమైన గిల్.. సిడ్నీ టెస్టు సందర్భంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. రోహిత్ ఓపెనర్‌గా వచ్చేందుకు గిల్ తన స్థానాన్ని త్యాగం చేయగా.. చివరి టెస్టుకు సైతం రోహిత్ అదే తరహాలో త్యాగం చేస్తాడా? అన్నది చర్చనీయాంశంగా మారింది. రోహిత్ ఈ టెస్టుకు దూరమైతే.. పెర్త్ టెస్టులో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన మిస్టరీ ఫాస్ట్‌బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకే కెప్టెన్సీ పగ్గాలు అందించే అవకాశాలున్నాయి. సిడ్నీలో టెస్టులో తప్పనిసరిగా విజయం సాధించడం టీమిండియాకు కీలకం. ఈ మ్యాచ్‌ను గెలిస్తేనే సిరీస్‌ను 2–2తో సమం చేసేందుకు అవకాశం ఉంటుంది. అలాగే, ప్రపంచ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్‌కు చేరుకు నేందుకు టీమిండియాకు అవకాశాలుంటాయి. అదే సమయం లో ఆస్ట్రేలియా, శ్రీలంక మధ్య జరిగే రెండు మ్యాచుల టెస్ట్ సిరీస్ ఫలితంపై కూడా భారత్ ఆధారపడాల్సిందే.

**పంత్ ఫామ్‌పై టీమ్ మేనేజ్‌మెంట్ ఆందోళన..**

ఆస్ట్రేలియా టూర్‌లో రోహిత్‌తో పాటు ఎక్కువగా చర్చకు వస్తున్న పేరు రిషబ్ పంత్. ఇప్పటి వరకు ఆస్ట్రేలియా పర్యటనలో రిషబ్ పంత్ పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. దాంతో టీమ్ మేనేజ్‌మెంట్ ఆందోళన మరింత పెరిగింది. జట్టు వికెట్లు కోల్పోయి.. కష్టాల్లో ఉన్న సమయంలో ఆచితూచి ఆడుతూ జట్టును గట్టెక్కించాల్సింది పోయింది.. బాధ్యతారహితమైన షాట్లు ఆడుతూ వికెట్ కోల్పోవడంపై అటు మాజీలతో పాటు.. అభిమానులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత టెస్టులో రిషబ్ పంత్ షాట్ ఎంపికపై తీవ్రంగానే విమర్శించారు. ప్రస్తుత పర్యటనలో పంత్ 22 సగటుతో ఏడు ఇన్నింగ్స్‌ల్లో 154 పరుగులు చేశాడు. ఇందులో ఒక అర్ధ సెంచరీ ఉంది. అయితే, టీమ్ మేనేజ్‌మెంట్ పంత్‌ని పక్కనే పెట్టే విషయంలో తొందరపడి నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. అయితే, పంత్‌ను పక్కన పెడితే.. ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్‌గా బాధ్యతలు తీసుకునే ఛాన్స్ ఉంది.

## కోనాపూర్ లో యాదవుల కొట్టాలకు వీధి దీపాలు



**రామాయంపేట,జనవరి02(సూర్య రేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఇచ్చిన మాట ప్రకారం యాదవుల కొట్టాలకు వీధిదీపాలు ఏర్పాటు చేశారు.వీధి దీపాలు గురువారం గ్రామ స్పెషల్ ఆఫీసర్ మండల తహసిల్దార్ రజనీకుమారి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదవులు మాట్లాడుతూ. గ్రామంలో ఉన్న యాదవుల కొట్టాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఇచ్చిన హామీని నెరవేర్చిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావుకు,మండల తహశీల్దార్ రజని కుమారికి,విద్యుత్ అధికారులకు వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగర్, సిద్ధరాములు,మహేష్,మాజీ సర్పంచ్ బీరయ్య,సురేష్, గ్రామస్తులు,యాదవులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పెద్దపీట వేస్తున్న బీజేపీ పార్టీ

**న్యూ ఇయర్ వేళ రైతులకు గుడ్ న్యూస్**

**బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్**




**తుర్కయంజాల్,జనవరి2(సూర్య రేఖ)** గత రెండు నెలలుగా సంస్థాగతపరంగా బిజెపి పార్టీ సభ్యత్వం,బూత్ కమిటీల ఎంపిక పూర్తయిందని బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ అన్నారు.తుర్కయంజాల్ మున్సిపాలిటీ భారతీయ జనతా పార్టీ మున్సిపల్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ హాజరై మాట్లాడుతూ..మున్సిపాలిటీలో 50 బూతులకు సుమారు 5900 సభ్యత్వాలు పూర్తయ్యాయన్నారు.50 బూత్ కమిటీలకు 29 బూత్ కమిటీలు పూర్తి చేశామని,మిగతా బూత్ కమిటీలను తొందరలోనే ప్రకటించి రాష్ట్ర కార్యాలయానికి పంపించడం జరుగుతుందన్నారు.2019 నుండి కేంద్ర ప్రభుత్వం రైతులకు ఏటా 6వేల సహాయం అందిస్తుందన్నారు.2025 సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పదివేల రూపాయలు పెంచడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు.సేంద్రియ ఎరువుల మీద 50 కేజీల డిఏపి బస్తా రూ.1350 లకు సబ్సిడీని ప్రకటించినందుకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చ కోశాధికారి బచ్చిగల్ల రమేష్,జిల్లా నాయకులు భిక్షపతి, యూసుఫ్ రెడ్డి,రాంరెడ్డి,కొంతం బాల్ రెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు బలదేవరెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షులు నరసింహ గౌడ్,మున్సిపాలిటీ బీజేవైఎం అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి,నాయకులు కొత్త రాంరెడ్డి,ఆదిభట్ల మున్సిపల్ జనరల్ సెక్రటరీ గజ్జల నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు

**రంగారెడ్డి :** 2025 కొత్త సంవత్సర వేడుకలు రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఘనంగా జరిగాయి. ఈరోజు ఉదయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య కేక్ కట్ చేశారు. సిబ్బంది అందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అందరి కృషితో డిసెంబర్ లో నిర్వహించిన విశ్వవిద్యాలయ వజ్రోత్సవ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించ గలిగామని ఆయనన్నారు. భవిష్యత్తులోనూ విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి అందరూ పునరంకితం అవ్వాలని జానయ్య పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోదనేతర, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జీపీ కారోబార్ సిబ్బంది క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

**హైదరాబాద్ :** గత కెసీఆర్ ప్రభుత్వం హయాంలో గ్రామపంచాయతీ ఉద్యోగుల జీతాలు 15 నెలల వరకు పెండింగ్లో ఉండగా, తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవతో రూ.192 కోట్ల నిధులు విడుదల అయ్యాయని తెలంగాణ స్టేట్ గ్రామపంచాయతీ కారొబార్ సిబ్బంది అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు... ఉద్యోగుల జీతాలు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ అవుతున్నాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా, 2025 సంవత్సరానికి సంబంధించిన అసోసియేషన్ క్యాలెండర్ను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాంపల్లి పబ్లిక్ గార్డెన్లో ఆవిష్కరించారు..అనంతరం అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వంగా రవీందర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని తెలి పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, గ్రామపంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ గర్ల్స్ హాస్టల్‌లో ఉద్రిక్తత

**మేడ్చల్ :** హాస్టల్ బాత్రూంలో వీడియోలు తీసారంటూ మేడ్చల్ లోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యా ర్థునీలు ఆందోళనకు దిగారు. వారికి విద్యార్ధి సంఘాలు మద్దతు పలకడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థినిలు హాస్టల్లో పనిచేసే సిబ్బంది విద్యార్థులను అసభ్యంగా వీడియో తీశారని ఆరో పిస్తూ బుధవారం రాత్రి ఆందోళన చేపట్టారు. సిఎంఆర్ కాలేజ్ గర్ల్స్ హాస్టల్ లో స్నానాల గదిలో వీడియోలు తీశారని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారుఏ. నిందితుల పై చర్యలు తీసుకుంటామని, హామీ ఇచ్చేంతవరకు ఆందో ళన విరమించేది లేదని హాస్టల్ బయట బైఠాయించారు. ఈ ఘటనపై ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, స్పందించారు. హాస్టల్ ఉద్యోగుల వద్ద స్వాధీనం చేసుకున్న11 సెల్ ఫోన్లో లో అభ్యంతకర వీడియోలు ఏమీ లేవని స్పష్టం చేశారు. వీడియోలు రికార్డ్ చేసినట్లు కుడా ఎలాంటి ఆధారాలు లేవన్నారు. అటు కాలేజీ విద్యార్థులు గురువారం మరోసారి ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది, వీడియోలు తీసిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం

# రేవంత్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

**హైదరాబాద్ :** బీఆర్ ఎపస్ ఎమ్మెల్యేలు కె .పి .వివేకానంద ,మర్రి రాజశేఖర్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ గురువారం నాడు తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే కె .పి .వివేకానంద మాట్లాడుతూ .మెట్రో ప్రాజెక్టును శామీర్ పేట ,మేడ్చల్ వరకు విస్తరిస్తామని నిన్న సీఎం రేవంత్ రెడ్డి ఓ ప్రకటన చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం మెట్రో మూడో దశ విస్తరణకు సంబంధించి నిర్ణయం తీసుకుంది. కన్సల్టెంట్ ను కూడా కేసీఆర్ ప్రభుత్వం నియమించింది. రేవంత్ రెడ్డి అధికారం లోకి వచ్చి రాగానే కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలని మెట్రో విస్తరణ ప్రాజెక్టు ను రద్దు చేశారు. ఏడాది గా రేవంత్ నిర్ణయాలన్నీ తిరోగమన చర్యలే నని అన్నారు. తెలంగాణ అభివృద్ధి ని కుంటుపడేలా చేశారు. ఏడాది గా మెట్రో పై కాలయాపన చేసి నిన్న కేసీఆర్ ప్రభుత్వం లో తీసుకున్న నిర్ణయాన్నే ప్రకటించారు. హైదరాబాద్ ను వరల్డ్ క్లాస్ సిటీ గా మార్చేందుకు కే టీ ఆర్ రోడ్ మ్యాప్ ను తయారు చేశారు. ఏడాదిగా కేసీఆర్ హయం లో తీసుకున్న నిర్ణయాలు అమలు చేసి ఉంటె తెలంగాణ పురోగమన దిశలో ఉండేది. అన్ని వ్యవస్థలను రేవంత్ ద్వంసం చేశారు. కేవలం తన అహం తో రేవంత్ కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టు లను ఆపారు. నిన్న కాంగ్రెస్ నేతలతో తాను మారిన మనిషినని రేవంత్ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. అంటే ఏడాది కాలం లో తన చర్యలు తప్పు అని రేవంత్ ఒప్పుకుంటున్నారు. కేసీఆర్ తెలంగాణ అభివృద్ధి కి వేసుకున్న రోడ్ మ్యాప్ ను రేవంత్ అమలు చేయక తప్పదు. మెట్రో తాజా ప్రతిపాదనలు బీ ఆర్ ఎస్ సాధించిన విజయమని అన్నారు. .హైదరాబాద్ ఉత్తరం లో మెట్రో ప్రాజెక్టును



విస్తరించాలని ప్రజలు చేసిన ఉద్యమానికి సీఎం మెడలు వంచక తప్పలేదు. .రాయదుర్గ్ నుంచి శంషాబాద్ వరకు మెట్రో విస్తరణకు కూడా రేవంత్ పూనుకోవాలి . పది లక్షల మంది ఐటీ ఉద్యోగులున్న ప్రాంతం లో మెట్రో విస్తరణ గురించి ఎందుకు ఆలోచించరు ? జే బీ ఎస్ నుంచి శామీర్ పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ కు సీఎం రేవంత్ శంఖు స్థాపన చేసినా ఇప్పటివరకు తట్టెడు మట్టి తీయలేదు . శామీర్ పేట ,మేడ్చల్ వరకు మెట్రో విస్తరణ పనులు ఎప్పటి వరకు పూర్తి చేస్తారో చెప్పాలి. కేంద్రం నుంచి సాయం వస్తేనే పనులు చేపడతామని అనడం సరికాదు. .కేసీఆర్ హాయం లో పెద్ద ప్రాజెక్టులెన్నో రాష్ట్ర సొంత నిధులతో పూర్తి అయ్యాయి . హైదరాబాద్ ఉత్తరాది మెట్రో పనులను ద్వితీయ ప్రాధాన్యత లో చేర్చడం సరికాదు. .వెంటనే మొదటి ప్రాధాన్యత లో చేర్చాలి. మెట్రో ,ఫార్మా ,హైడ్రా ,హైదరాబాద్ కు తాగునీరు వంటి అంశాల్లో సీఎం రేవంత్ తిరోగమన చర్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రేవంత్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ .మేడ్చల్ ,శామీర్ పేటలకు మెట్రో రైలు ప్రాజెక్టు అనేది కేసీఆర్ హాయం లో తీసుకున్న నిర్ణయం. వెంటనే ప్రథమ ప్రాధాన్యత క్రమం లో ఈ ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ కొత్త సంవత్సరం లోనైనా సీఎం రేవంత్ రెడ్డి తిరోగమన చర్యలు ఆపాలి. ఏడాది లో రేవంత్ తుగ్లక్ నిర్ణయాలెన్నో తీసుకున్నారు. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ వివిధ వర్గాలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు. 400 రోజుల్లో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారు. అరాచక పాలన రాష్ట్రం లో నడుస్తోంది. కేసీఆర్ హాయం లో తీసుకున్న నిర్ణయాలను మొదట్లో రేవంత్ రద్దు చేసి ఏడాది తర్వాత మళ్ళీ వాటినే అమలు చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ,పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల పై కూడా రేవంత్ వైఖరి ఒకేలా లేదు. జేబీఎస్ నుంచి తూము కుంట ,పారడైస్ నుంచి కండ్ల కోయ వరకు మెట్రో విస్తరణ పనులు కేసీఆర్ హయం లో ప్రతిపాదించినవే ..కొన్ని కిలోమీటర్ల వరకు మార్గాన్ని పొడగించి రేవంత్ గొప్పలు చెప్పుకుంటున్నారు . డాది లో లక్షా 37 వేల కోట్ల అప్పు చేసి ఒక్క పెద్ద ప్రాజెక్టు నైనా కట్టారా ? ఒక్క కొత్త సంక్షేమ పథకమైనా తెచ్చారా ? ఏడాది లో గురుకులాల్లో 56 మంది విద్యార్థులు మరణించారు. లగ చర్ల లో లంబాడాలపై ,అశోక్ నగర్ లో నిరుద్యోగుల పై లాఠీలు విరగడం తప్ప రేవంత్ ప్రభుత్వం ఏమీ సాధించింది. రేవంత్ సంపాదనలో రవ్వంత కాదు కొండంత గా మారారని అన్నారు. రేవంత్ కు సొంత సంపాదన పై ఉన్న శ్రద్ధ ప్రజల పైన లేదు. .తెలంగాణ కు కేసీఆర్ లక్షల కోట్ల సంపాదన ను సృష్టించారు. రేవంత్ హయం లో భూ సంపద కూడా ఆవిరై పోయిందని అన్నారు.

# ప్రజలకు గ్రామ స్థాయిలో ప్రభుత్వ ఫలాలు అందాలి

**ప్రతి మండలంలో నమునా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టాలి**

**విద్యుత్ సరఫరా సమస్యల పై సంపూర్ణ నివేదిక అందించాలి**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి :** ప్రజలకు గ్రామ స్థాయిలో ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గ్రామ పంచాయ తీల పని తీరు పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే, జాతీయ ఉపాధి హామీ పనులు, గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ, డంపింగ్ యార్డ్, విద్యుత్ సరఫరా పనులు, గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నద్ధత వంటి పలు అంశాల పై కలెక్టర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రతి మండలంలో ఉపాధి హామీ పనుల్లో లేబర్ టర్న్ ఔట్ పెంచాలని, ఉపాధి కార్మికులకు కూలీల చెల్లింపు సకాలంలో జరిగేలా చూడాలని, కూలీల చెల్లింపులు ఎటువంటి సమస్యలు రావద్దని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. గ్రామాలలో నూతనంగా నిర్మాణం అవుతున్న ఇండ్లలో స్వచ్ఛ భారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ పై మండల పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. గ్రామాలలో చెత్త అధికంగా ఉంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, రోడ్ల పై ఎక్కడా చెత్త, ప్లాస్టిక్ ఉండకుండా పంచాయతీ కార్యదర్శులను బాధ్యులను చేయాలని, ప్రతి రోజు మల్టి పర్పస్ వర్కర్లతో రోడ్లు శుభ్రం చేయించాలని, పారిశుధ్య పనులను నిరంతరం తనిఖీ చేయాలని అన్నారు. ప్రతి రోజు గ్రామాలలో జరిగే పారిశుధ్య పనులు తనిఖీ చేస్తూ సిబ్బంది అటెండెన్స్ వేయాలని, సంక్రాంతి నాటికి పరిస్థితులు మారాలని అన్నారు. ఎంపిఓలు అధికంగా గ్రామాలను తనిఖీ చేయాలని, సదరు తనిఖీ వివరాలతో నివేదిక అందించాలని అన్నారు. గ్రామాలలో ఉన్న సెగ్రిగేషన్ షెడ్ పని తీరు పరిశీలన కోసం ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారికి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో నర్సరీ లలో బ్యాగ్ ఫీలింగ్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో ఉన్న విద్యుత్ , త్రాగు నీటి సమస్యల వివరాలను వచ్చే శనివారం నాటికి జిల్లా పంచాయతీ అధికారికి అందించాలని కలెక్టర్ ఎంపిడిఓ లకు సూచించారు. జాతీయ ఉపాధి హామీ క్రింద గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి చెల్లింపులు సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని, ప్రతి గ్రామంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు పోలింగ్ కు అవసరమైన పోలింగ్ కేంద్రాలు, అవసరమైన సిబ్బంది మొదలగు వివరాలను సరి చూసుకోవాలని అన్నారు. ప్రజా పాలన ద్వారా ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి ప్రస్తుత స్థితి గతి తెలిసేలా ఫోటో యాప్ లో అప్లోడ్ చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ప్రతి మండలంలో నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం స్థలాన్ని గుర్తించి పనులు వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జడ్పి సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, ఎంపీడీవో లు, ఎంపీ ఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ గర్ల్స్ హాస్టల్‌లో ఉద్రిక్తత



**మేడ్చల్ :** హాస్టల్ బాత్రూంలో వీడియోలు తీసారంటూ మేడ్చల్ లోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థనీలు ఆందోళనకు దిగారు. వారికి విద్యార్థి సంఘాలు మద్దతు పలకడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థినిలు హాస్టల్లో పనిచేసే సిబ్బంది విద్యార్థులను అసభ్యంగా వీడియో తీశారని ఆరో పిస్తూ బుధవారం రాత్రి ఆందోళన చేపట్టారు. సిఎంఆర్ కాలేజ్ గర్ల్స్ హాస్టల్ లో స్నానాల గదిలో వీడియోలు తీశారని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారుఏ. నిందితుల పై చర్యలు తీసుకుంటామని, హామీ ఇచ్చేంతవరకు ఆందోళన విరమించేది లేదని హాస్టల్ బయట బైఠాయించారు. ఈ ఘటనపై ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, స్పందించారు. హాస్టల్ ఉద్యోగుల వద్ద స్వాధీనం చేసుకున్న11 సెల్ ఫోన్లో లో అభ్యంతకర వీడియోలు ఏమీ లేవని స్పష్టం చేశారు. వీడియోలు రికార్డ్ చేసినట్లు కుడా ఎలాంటి ఆధారాలు లేవన్నారు. అటు కాలేజీ విద్యార్థులు గురువారం మరోసారి ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది, వీడియోలు తీసిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం

## కంటోన్మెంట్ అభివృద్ధిలో బిజెపి నాయకుల పాత్ర కీలకం

**సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధిలో బిజెపి నాయకులు మరియు కార్యకర్తల పాత్ర కీలకంగా ఉందని వారి కృషి ఫలితంగా కంటోన్మెంట్ లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కంటోన్మెంట్ బోర్డు మెంబర్ జన్యావుల రామకృష్ణ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ వార్డ్ 6, పద్మనాభ కాలని ( మారుతీ నగర్ ఎక్సటెన్షన్) లో 15 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కంటోన్మెంట్ బోర్డ్ మెంబర్ జన్యావుల రామకృష్ణ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి నాయకులు మరియు కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్యలో ఉండి సమస్యలను గుర్తించి పరిష్కారానికి ఎంతగానో కృషి చేస్తున్నారని, ప్రజలతో మమేకమై ఎప్పటికప్పుడు ప్రతీ విషయాన్ని అధికారుల దృష్టికి మరియు నాయకుల దృష్టికి తీసుకువెళ్ళి అభివృద్ధి పనులు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. వారి త్యాగం, వారి పోరాటం, సమస్యలపై వారు స్పందించే తీరు గొప్పదని కొనియాడారు.తరువాత కాలనీ వాసులు మాట్లాడుతూ ఫోన్ చేసిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించడంలో రామకృష్ణ ముందుంటారని, ఏ సమస్య వచ్చిన నేనున్నాను అంటూ భరోసా కల్పిస్తారని, వారి కృషి ఫలితంగా కంటోన్మెంట్ అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ రామకృష్ణ ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ 6 బిజెపి అధ్యక్షులు అజయ్ గౌడ్, నాయకులు రవీందర్ రెడ్డి, నాగభూషన్, నారాయణ, స్వరూప, భారతి, రమేష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, నిరంజన్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ హైకోర్టులో పూర్తిస్థాయి జడ్జీలు వుండాలి



**హైదరాబాద్ :** నేటికి సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం లోక్ సభ లో వేసిన ప్రశ్నోత్తరాల సమయం లో హైకోర్టు ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపాను. 2019 డిసెంబర్ 31 నాడు తెలంగాణ కు ప్రత్యేక హై కోర్టు వచ్చింది. తెలంగాణ హై కోర్టు కు 42 మంది జడ్జిలు ఉండాలని నిర్ణయం తీసుకున్నా ఎపుడూ 23 మంది కి మించి భర్తీ చేయడం లేదని మాజీ ఎంపి బి వినోద్ కుమార్ అన్నారు. తెలంగాణ జడ్జీల్లో ఎస్సీ ,ఎస్టీ లకు సంబంధించిన వారు ఎవ్వరూ లేరు. పూర్తి స్థాయిలో జడ్జీలను నియమిస్తే దళిత గిరిజన వర్గాలకు కూడా న్యాయం జరుగుతుంది. కేసీఆర్ హయం లోనే మేము పార్లమెంటు లో ఒత్తిడి చేసిన ఫలితంగా హై కోర్టు జడ్జీల సంఖ్యను 42 కు పెంచారు. .హై కోర్టు లో పెండింగ్ కేసుల సంఖ్య నానాటికి పెరిగి పోతోంది ..జడ్జీలు పూర్తి స్థాయిలో ఉంటె తప్ప కేసులు తొందరగా పరిష్కారం కావు. హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంటనే జోక్యం చేసుకుని పూర్తి స్థాయి లో జడ్జీల నియమాకానికి చర్యలు చేపట్టాలి. సామాజిక న్యాయం న్యాయ వ్యవస్థ లో కూడా పాటించాల్సిందే. వేరే రాష్ట్రాల నుంచి తెలంగాణ హై కోర్టులో నలుగురు జడ్జీలు ఉన్నారు. జడ్జీలు పూర్తి స్థాయిలో ఉంటేనే తెలంగాణ కు కూడా న్యాయం జరుగుతుంది. శామీర్ పేటకు మెట్రో రైల్ ప్రాజెక్టు వేస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదు. ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజల కష్టాలు పోవాలంటే నాగపూర్ తరహాలో జేబీఎస్ నుంచి శామీర్ పేట కు డబుల్ డెక్ ఫ్లై ఓవర్ ను ఏర్పాటు చేయాలని అన్నారు.

## రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల మండలంలోని కల్వటాల గ్రామంలో ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ వారి ఆదేశాలు మేరకు క్షయవ్యాధి నిర్మూలన దిశగా ప్రచారం కార్యక్రమంలో భాగంగా రాంకో సిమెంట్ యాజమాన్యం వారు గురువారం నాడు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పం దన లభించింది. కల్వటల గ్రామంలోని సచివాలయం లో డా. శశిధర్ ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో 106 మంది రోగులు వైద్య సేవలు వినియోగించుకున్నారు. రోజులకు రెండు నెలలకు సరిపడే మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు డాక్టర్లు తెలిపారు. ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన పలు జాగ్రత్తలను రోగులకు సూచించారు. వ్యాధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించ్చవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైన్స్ జిఎం అజ్మల్ అహ్మద్, మైన్స్ డీఎం నాయుడు,నరేష్, డాక్టర్ శశిధర్, సంస్థ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు...

## పేదలతో ఆటలాడుతున్న జీహెచ్ఎంసి

**హైదరాబాద్ :** జిహెచ్ఎంసి అధికారులు పేదవారి ఆశలతో ఆడుకుంటున్నారని జియాగూడ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేసారు. జిహెచ్ఎంసి అధికారులు స్థానికులకు కొందరికి ఫోన్ చేసి మీకు డబల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు అలర్ట్ అయ్యాయని వాటికి సంబంధించి డబల్ బెడ్ రూమ్ వద్ద ఉన్న వార్డ్ ఆఫీస్ కి రావాలని కోరారు, దీంతో ఫోన్ చేసిన వారందరూ వాట్ ఆఫీస్ వద్దకు వచ్చి ఉదయం నుండి సాయంత్రం వరకు పడిగాపులు కాసి గత వారం రోజులుగా ఇదే జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ చేసి రమ్మని చెప్పి తీరా వారు వచ్చేసరికి ఆఫీసులకు తలుపులు పెట్టి వారి సొంత పనులపై వెళ్తున్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకరోజు రెండు రోజులు కాదు ఇలా వారం రోజులు పాటుగా వర్డ్ ఆఫీస్ కి చెక్కర్లు కొడుతున్నామని ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాడు ఆఫీస్ వారిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

## ఉప్పల్ స్టేడియంలో ప్రైవేటు ఈవెంట్లు బంద్

**హైదరాబాద్ :** ఉప్పల్ జిహెచ్ఎంసి స్టేడియంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిర్వహించిన ప్రైవేట్ పార్టీ దుమారం రేపుతోంది. ఈ సంఘటనపై జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు స్పందించారు. న్యూఇయర్ సెలబ్రేషన్స్ అనంతరం పగిలిన మద్యం సీసాలు , వ్యర్థ ఆహర పదార్థాలతో మున్సిపల్ గ్రౌండ్ మొత్తం భ్రష్టుపట్టించారని అందుకు బాధ్యులైన త్రైవ్ ఈవెంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఇకనుండి ఎటువంటి ప్రవేట్ ఈవెంట్లకు పర్మిషన్ ఇవ్వమని డిసి తెలిపారు

## స్టేడియంను నాశనం చేసారు

**హైదరాబాద్ :** ఉప్పల్ జిహెచ్ఎంసి స్టేడియంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిర్వహించిన ప్రైవేట్ పార్టీ దుమారం రేపుతోంది. ప్రభుత్వ స్థలంలో న్యూ ఇయర్ వేడుకల పేరుతో అన్ లిమిటెడ్ మద్యం సరఫరా చేసి యువతను పెడదారి పెట్టించడంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని నాశనం చేశారని చిలుకానగర్ కార్పోరేటర్ , జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ఆరోపించారు. త్రైవ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఇయర్ వేడుక లలో విపరీతమైన మద్యం సరఫరా , అసభ్యకరమైన డ్యాన్యులతో హంగామా చేశారని అన్నారు. జిహెచ్ఎంసి స్థలంలో న్యూఇయర్ సెలబ్రేషన్స్ అనంతరం పగిలిన మద్యం సీసాలు , వ్యర్థ ఆహర పదార్థాలతో మున్సిపల్ గ్రౌండ్ మొత్తం భ్రష్టుపట్టించారని అందుకు బాధ్యులైన ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ తోపాటు ఇతర శాఖల అధికారుల , ఈవెంట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కార్పోరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ డిమాండ్ చేశారు.

## రేవంత్ ఇప్పుడు పాన్ ఇండియా స్టార్

**భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్ :** కేంద్ర మంత్రి గడ్కరీ ని సీఎం రేవంత్ రెడ్డి కలసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై వివరించారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును మొత్తం కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని కోరాం. ముందు ల్యాండ్ సేకరించాలని కేంద్ర మంత్రి మాకు సూచించారు. దోచుకునే ,దాచుకునే ఆలోచన మాకు లేదని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. అయన గురువారం నాడు గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. ఇష్టా రీతిన ప్రాజెక్టు కాస్ట్ పెంచారు కాబట్టే..7 వేల కోట్ల ప్రాజెక్టులో 12 వేల అవినీతి జరిగిందని కేటీఆర్ అంటున్నాడు. కేటీఆర్ లాగే అందరూ చేస్తారనుకుంటున్నారు. కేసీఆర్ లా ప్రతిపక్షం ను మేము లేకుండా చేయాలనుకోవడం లేదు.. బలమైన ప్రతిపక్షం ఉండాలనుకుంటున్నాం. కేసీఆర్ ఎలాగూ బయటకు రాడు.. హరీష్ రావు, కేటీఆర్, కవిత వెళ్లి అయినా సమర్ధవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తే మంచిది. 2025లో అయినా బీఆర్ఎస్ నేతలకు జ్ఞానోదయం కలగాలి. రైతు భరోసా విషయం లో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుంది. కేసీఆర్ అనాలోచిత నిర్ణయం వల్ల రైతు బంధు లో 22 వేల కోట్ల రూపాయలు అనర్హులకు ఇచ్చారు. ఈ ఫార్ములా కేసులో కేటీఆర్ రోజుకో మాట మాట్లాడుతున్నాడు. ఒకరోజు సంబంధం లేదు అంటాడు.. మరోక రోజు అధికారులకు సంబంధం లేదు.. అంతా నేనే చేసాను అంటాడు. అధికారులకు సీరియస్ నెస్ తగ్గింది. బీఆర్ఎస్ లో సింగిల్ విండో ద్వారా ఆదేశాలు వెల్లెవి..ఇప్పుడు చాలా మంది నుంచి ఆదేశాలు వెల్తున్నాయి. పుష్ప అరెస్ట్ తో రేవంత్ రెడ్డి పాన్ ఇండియా సీఎం అయ్యారని అన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు

**రంగారెడ్డి :** 2025 కొత్త సంవత్సర వేడుకలు రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఘనంగా జరిగాయి. ఈరోజు ఉదయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య కేక్ కట్ చేశారు. సిబ్బంది అందరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అందరి కృషితో డిసెంబర్ లో నిర్వహించిన విశ్వవిద్యాలయ వజ్రోత్సవ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించ గలిగామని ఆయనన్నారు. భవిష్యత్తులోనూ విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి అందరూ పునరంకితం అవ్వాలని జానయ్య పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోదనేతర, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జీపీ కారోబార్ సిబ్బంది క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

**హైదరాబాద్ :** గత కెసీఆర్ ప్రభుత్వం హయాంలో గ్రామపంచాయతీ ఉద్యోగుల జీతాలు 15 నెలల వరకు పెండింగ్లో ఉండగా, తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవతో రూ.192 కోట్ల నిధులు విడుదల అయ్యాయని తెలంగాణ స్టేట్ గ్రామపంచాయతీ కారొబార్ సిబ్బంది అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు... ఉద్యోగుల జీతాలు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ అవుతున్నాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా, 2025 సంవత్సరానికి సంబంధించిన అసోసియేషన్ క్యాలెండర్ను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాంపల్లి పబ్లిక్ గార్డెన్లో ఆవిష్కరించారు..అనంతరం అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వంగా రవీందర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని తెలి పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, గ్రామపంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఈ నెల నాలుగునుంచి ఇంద్రజాల్ మెగా మ్యాజిక్ షో

**సికింద్రాబాద్ :** ప్రపంచ ప్రఖ్యాత మెజిషియన్ పి సి సర్కార్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ హరిహర కళాభవన్ లో ఇంద్రజాల్ మెగా మ్యాజిక్ షోను నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 4న మెగా మ్యాజిక్ షోను హరిహర కళాభవన్ వేదికగా ప్రారంభించనున్నట్లు ప్రముఖ మెజీషియన్ పోరుష్ పేర్కొన్నారు. జనవరి 4 నుండి 19 వరకు శని ఆదివారాలలో సాయంత్రం నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకు ప్రదర్శనలు జరగనున్నట్లు వెల్లడించారు. పీవీ సర్కార్ గొప్ప కళ్ళతో అంతర్జాతీయ స్థాయిలో మెజీషియన్ గా కీర్తి ప్రతిష్టలు పొందారని ఆయన బాటలోనే తాను కూడా నడుస్తున్నట్లు పొరుష్ తెలిపారు.




# ఫ్యాన్స్‌కు పూనకాలే..

## బాలకృష్ణ డాకు మహారాజ్ దబిడి దిబిడి సాంగ్ వచ్చేసింది

నందమూరి బాలకృష్ణ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం డాకు మహారాజ్ ఎన్‌బీకే 109 గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాబీ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. ఇందులో భాగంగా ముందుగా అందించిన అప్‌డేట్ ప్రకారం డాకు మహారాజ్ థర్డ్ సింగిల్ దబిడి దిబిడి సాంగ్ లాంచ్ చేశారు. అన్‌స్టాపబుల్ మాస్ బ్లాస్ట్ సాంగ్‌లో బాలకృష్ణ, ఊర్వశి రౌటేలా కాంబోలో సాగే స్టైలిష్ మాస్ డ్యాన్స్ అభిమానులకు పూనకాలు తెప్పించడం ఖాయమని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను థమన్, వాగ్దేవి పాడారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశాడు. ఈ చిత్రంలో బాబీ డియోల్ విలన్‌గా నటిస్తుండగా..శ్రద్దా శ్రీనాథ్, ప్రగ్యాజైశ్వాల్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ , సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# షాహిద్ కపూర్ 'దేవా' ఫస్ట్ లుక్ రిలీజ్




తేరీ బాతోన్ మే ఐసా ఉలా జియా సినిమాతో గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకున్నాడు షాహిద్ కపూర్. రోబోతో ప్రేమలో పడిన యువకుడి పాత్రలో ఈ చిత్రంలో మంచి మార్కులు సంపాదించాడు. అయితే తాజాగా ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం దేవా బిగ్ బీ అమితాబ్ బచ్చన్ దేవా సినిమాను ప్రేరణగా తీసుకుని ఈ చిత్రం రూపొందుతుండగా.. మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రోస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. పూజ హెగ్దే, పావేల్ గులాటి తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ తాజాగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ ఫస్ట్ లుక్‌లో షాహిద్ రూత్‌లెస్ పోలీస్‌గా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాను జనవరి 31న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

# రెండు తేదీలపై అజిత్ కుమార్ టీం ఫోకస్



**విదాముయార్చి ఏ డేట్‌కు రిలీజయ్యేనో?**

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ వరుస సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ ప్రాజెక్టుల్లో ఒకటి మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తున్న విదాముయార్చి ఏకే 62గా తెరకెక్కుతున్న ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ సినిమా విడుదల తేదీపై ఏదో ఒక న్యూస్ నెట్టింట హల్ చల్ చేస్తున్నా మేకర్స్ నుంచి మాత్రం అధికారిక ప్రకటన బయటకు రావడం లేదు. ఈ చిత్రం పొంగళ్ కానుకగా రాబోతుందంటూ వార్తలు వచ్చినా పుకార్లుగానే మిగిలిపోయాయి. తాజాగా విదాముయార్చి రిలీజ్‌పై ఆసక్తికర న్యూస్ ఒకటి సోషల్ మీడియాలో రౌండప్ చేస్తోంది. మేకర్స్ ఈ చిత్రానికి రెండు విడుదల తేదీలను పరిశీలిస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్. తాజా వార్తల ప్రకారం ఈ మూవీని జనవరి 31న కానీ లేదా ఫిబ్రవరి 7న కానీ విడుదల చేయాలనుకుంటున్నారని ఓ వార్త నెట్టింట వైరల్ అవుతోంది. మరి మేకర్స్ ఈ రెండింటిలో ఏదో ఒక డేట్‌ను ఫైనల్ చేస్తారా..? లేదంటే మరో తేదీని ప్రకటిస్తారా..? అనేది తెలియాల్సి ఉంది. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వస్తోన్న ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్ సార్జా కీలక పాత్రలో నటిస్తుండగా.. రెజీనా కసాండ్రా మరో కీ రోల్ పోషిస్తోంది. ఇప్పటికే విదాముయార్చి నుంచి షేర్ చేసిన పోస్టర్లు నెట్టింట చక్కర్లు కొడుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో ఆరవ్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. అజిత్ కుమార్ దీంతోపాటు అధిక్ రవిచంద్రన్ డైరెక్షన్‌లో ఏకే 63 కూడా చేస్తున్నాడని తెలిసిందే. గుడ్ బ్యాడ్ అగ్లీ టైటిల్‌తో వస్తోన్న ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది.



# 'గేమ్ ఛేంజర్'.. పాటల కోసమే రూ.75 కోట్లు

తమిళ దిగ్గజ దర్శకుడు శంకర్ సినిమాలంటేనే భారీ బడ్జెట్‌తో ఉంటాయి. స్టంట్స్‌కే కాదు సినిమాలో వచ్చే పాటల కోసం కూడా డబ్బులను కోట్లల ఖర్చు చేస్తుంటాడు శంకర్. అయితే శంకర్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. రామ్ చరణ్ కథానాయకుడిగా వస్తున్న ఈ చిత్రంలో కియరా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుంది. ఇండియన్ 2 వంటి డిజాస్టార్ తర్వాత ఎలాగైన హిట్ కొట్టాలనే కసితో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు శంకర్. అయితే ఈ సినిమాకు పాటలకు సంబంధించి ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్‌ను పంచుకుంది చిత్రబృందం. ఈ సినిమాలో కేవలం పాటల కోసమే రూ. 75 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలుస్తుంది. తాజాగా ఈ విషయాన్ని సినీ విశ్లేషకుడు తరుణ్ ఆదర్శ్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఈ సినిమాలో ఒక్కో పాటకు ఒక్కో ప్రత్యేకత ఉన్నట్లు వెల్లడించాడు. ఈ మూవీలోని ఫస్ట్ సింగిల్ జరగండి జరగండి (%జ్ఞుతీఝస్త్రుఅఎఱ%) సాంగ్‌కు ప్రభుదేవా కొరియోగ్రఫీ చేయగా.. 600 మంది డాన్సర్లు ఈ పాటలో పాల్గొన్నట్లు తెలిపింది. 13 రోజుల పాటు షూటింగ్ చేసిన ఈ సాంగ్‌లో. 70 అడుగుల ఎత్తయిన కొండ, విలేజ్ సెట్, అందుకు తగిన కాస్ట్యూమ్స్, అన్నింటినీ పర్యావరణహితమైన జనపనారతో తయారు చేసినట్లు ప్రకటించింది.

**రా మచ్చా మచ్చా**

సెకండ్ సింగిల్ రా మచ్చా మచ్చా పాట కోసం 1000 మందికిపైగా జానపద కళాకారులు నృత్యం చేసినట్లు తెలుస్తుంది. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేష్ ఆచర్య కొరియోగ్రఫీలో వచ్చిన ఈ సాంగ్‌లో దేశంలోని వివిధ ప్రాంతల్లో ప్రసిద్ధి చెందిన గుస్సాడీ (ఆదిలాబాద్), చావ్ (పశ్చిమ బెంగాల్), ఘూమ్రా (ఒడిశా–మట్టిల్కల), తప్పెటగుళ్లు– (విజయనగరం), దురావా–(ఒడిశా) తదితర నృత్య కళలు ఇందులో కనిపించబోతున్నాయి.

'నానా హైరానా'

ఇండియన్ సినిమాలో ఇన్‌ఫ్రారెడ్ కెమెరాతో షూట్ చేసిన మొదటి చిత్రంగా గేమ్ ఛేంజర్ నిలిచింది. ఈ మూవీలోని 'నానా హైరానా' అనే సాంగ్ కోసం ఇన్‌ఫ్రారెడ్ కెమెరాను వాడినట్లు తెలిపారు. న్యూజిలాండ్‌లో ఈ పాట షూటింగ్ జరుపుకోగా.. వెస్ట్రన్ %d% ఇండియన్ మ్యూజిక్‌తో ఈ సాంగ్ ఉండబోతుందని సమాచారం. అమెరికాలో నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకలో దోప్ సాంగ్ పాపులర్ అయిన విషయం తెలిసిందే. అయితే ఈ పాటను కోవిడ్ సెకండ్ వేవ్‌లో చిత్రీకరించినట్లు తెలుస్తుంది. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో వచ్చిన ఈ పాట కోసం రష్యాకు చెందిన 100 మంది ప్రొఫెషనల్ డ్యాన్సర్లను ప్రత్యేక విమానంలో తీసుకొచ్చి మరీ షూటింగ్ జరిపారు. రామోజీ ఫిలిం సిటీలో దాదాపు 8 రోజుల పాటు ఈ సాంగ్ షూటింగ్ జరిగినట్లు తెలుస్తుంది. అయితే ఈ నాలుగు పాటలే కాకుండా ఐదో పాట కూడా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ పాటను వెండితెరపై విడుదల చేయనున్నట్లు టాక్.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,